ప్రజాశక్తి

Vol. 1, no. 3

(Jul. 1, 1942)

బెజవాడ, 1942

Record no. 683

Prajāśakti

Vol. 1, no. 3

(Jul. 1, 1942)

Bejavāḍa, 1942

8 పేజీలు: అణా

Regd. No. M. 4486.

వచ్చే సంచికనుండి	
సం॥ చందా	4.0.0
అర్ధసం॥ ,,	2-0 0
విడిప్రతి 10 పే॥	0-1-6

ప్రజాశక్తి

అడ్వర్ టైజు మెంటురేట్లు	
పూర్తిపేజి	35.0.0
అరపేజి	18.0.0
పావుపేజి	10.0.0
కాలం అంగుళం	0.12.0

రాజకీయ వారపత్రిక

సంపాదకుడు : కాట్రగడ్డ రాజగోపాలరావు

సంపాదకవర్గం: చలసాని వాసుదేవరావు, తుమ్మల వెంకటరామయ్య, కొండేపూడి లక్ష్మీనారాయణ

సంపుటి 1 | బుధవారము 1-7-1942 బెజవాడ | సంచిక 3

మన రాజకీయాలు

గాంధిజీ బెదిరిస్తున్న నూతన సత్యాగ్రహోద్యమాన్ని ఖండిస్తూ, జిన్నా, ఒక ప్రకటనగావించాడు. బ్రిటిష్ ప్రభుత్వాన్ని బెదరించి ముస్లిములపై హిందూ కాంగ్రెసు రాజ్యాన్ని నెలకొల్పడానికే గాంధిజీ వుద్యమపు వుద్దేశ్య మన్నాడు. "బ్రిటిష్ ప్రభుత్వం భారతదేశాన్నుండి వెళ్ళిపోయేటట్లు కాంగ్రెసు చేస్తే ముస్లింలీగుగూడ సంతోషిస్తుంది. బ్రిటిషు అధికారం యిచ్చట కొనసాగుతూ ఉండడానికి ముస్లింలీగు అనుకూల మనేది దుష్ప్రచారం తప్ప మరేమీ గాదు." నెహ్రూ పాకిస్థాన్ గాని మరే కమ్యూనల్ సమస్యగాని ముందుగా చర్చించడానికి నిరాకరించాడు. స్వాతంత్ర్యం సంపాదించే పద్ధతులను మొట్టమొదట చర్చించాలంటాడు నెహ్రూ. స్వాతంత్ర్యం ఎవరిచేతుల్లో బ్రిటిష్ ప్రభుత్వం పెట్టాలో ముందు చర్చించమని అంటాడు జిన్నా. జిన్నా—నెహ్రూ వాగ్వివాదం కాంగ్రెసు లీగు ఐక్యతను దగ్గరికి తెచ్చేటట్లు ఏమీలేదు.

రాజాజీ వార్ధాలో గాంధీజీతో సంభాషించి బొంబాయిలో జిన్నాను కలుసుకున్నాడు. దీర్ఘసంభాషణలు జరిపాడు. తిరిగి గాంధీజీని కలుసుకొనబోతున్నాడు. రాజాజీ సంభాషణలు, ప్రయాణాలు కాంగ్రెసు - లీగు ఐక్యతకు తోడ్పడునదేమో చూడాల్సి వుంటుంది. ఈలోపల రాజాజీ పాకిస్థాన్ సూచనలకు వ్యతిరేకంగా తమిళనాడులో తీవ్ర ప్రచారం సాగుతోంది.

ప్రభుత్వం - ఫార్వర్డుబ్లాకు

కాంగ్రెసు - లీగు ఐక్యతస్థితి ఇలా వుంది. ఇక ప్రభుత్వం - భారతప్రజల మధ్య సంబంధ మెలాగుందో చూద్దాం. జపాను యుద్ధంలో దిగినది మొదలు ఫార్వార్డుబ్లాకు జపానుకు అనుకూల ప్రచారం చేస్తూ వచ్చింది. సుభాష్‌బోసు జపాను సైన్యాలతో వచ్చి భారతదేశానికి స్వాతంత్ర్య మిస్తాడన్న ప్రచారాన్ని చేస్తూ, కరపత్రాలను ప్రకటిస్తూ వచ్చింది. దేశంలో ముఖ్యంగా బెంగాలులో జపాను వ్యతిరేక ప్రచారం చేసేవారితో ఘర్షణ పడసాగింది. ఢక్కాలో ఫాసిస్టు వ్యతిరేక సభకు వెళ్ళుతూవున్న కార్మికోత్సవం పైబడి సోమెన్‌చంద్ అనే కమ్యూనిష్టు విద్యార్థిని కత్తితో పొడిచి చంపారు. కొమిల్లాలో మరియొక కమ్యూనిస్టును కత్తితో పొడిచారు. బెంగాలులో అనేకచోట్ల కమ్యూనిష్టు ప్రచారకులను ఒంటరిగా చూచి పైబడి కొట్టడం, ఫేసిస్టువ్యతిరేక ప్రచారం చేయమని సంతకం పెట్టమని వారిని నిర్బంధించడ, వారు నిరాకరిస్తే నానాహింసలు పెట్టడం సాగించింది. ఇట్టి ఫేసిస్టు హంతకుల పార్టీని, ప్రభుత్వ మింతవరకు నిషేధించలేక నిషేధించలేక కడకు నేడు నిషేధించింది. జాతీయ ప్రభుత్వమే వున్నట్లయితే ఇలాంటి పనులు గావించే సంస్థలను అణచివేయడంలో ఏమాత్రం వెనుకంజ వేసేది గాదు. ప్రజలు దానిని బలపరుస్తారుకూడ. కాని నేడే ప్రభుత్వం యీ నిషేధాన్ని కొన్ని పత్రికలు గర్హించడం, యీ ప్రభుత్వ మంటే ప్రజలకు యెంత అపనమ్మక మున్నదో తెలియజేస్తూ వుంది.

ఈ అపనమ్మకం ఫాసిస్టు వ్యతిరేక డెటిన్యూలను, ఖైదీలను యింకా వదిలిపెట్టకపోవడంతో మరింత ఎక్కువగుతుందే గాని మరేమీగాదు. సంయుక్త రాష్ట్రాలలో (యు. పి లో) నిర్బంధ విధానం మామూలుగనే సాగుతూ వుంది. కాంగ్రెసు సంఘ ఉపాధ్యక్షుడుమౌలానా హెచ్. ఎ. కుదానీని, మాజీ పార్లమెంటు కార్యదర్శి, ఫేసిస్టు వ్యతిరేకుడు అయిన ఎ. పి. జెయిన్‌ను అరెస్టు చేయడం, ప్రజలను ముఖ్యంగా యు. పి కాంగ్రెసు నాయకులను ప్రభుత్వానికి వ్యతిరేకం జేసుకోవడం తప్ప మరేమీ కాదు. గాంధీ బాబా ఆట జయప్రదంగా సాగడానికి తోడ్పడడం కాక మరేమీ గాదు. గాంధీజీతో పూర్తిగా ఏకీభవించని నెహ్రూ, తదితర అతివాదులను బలహీనపర్చుట తప్ప మరేమీ గాదు.

గాంధిజీ ప్రకటనలు

"అక్షరాజ్యాలనుండి సాయం తీసుకొనే సుభాష్ పద్ధతిని నేనంగీకరించను. బ్రిటిషు పరిపాలనస్థానే మరియొక విదేశీయ పరిపాలన మార్పుకు నేనేమీ అనుకూలుడను గాను. భారత దేశానికి అక్ష రాజ్యాలు వస్తే, మనలను స్వతంత్రులను చేయడానికిరారు. భారతదేశాన్ని దోచుకోడానికి భాగస్వాములుగా వస్తారు.

ఒక అమెరికను పత్రికా విలేఖరితో (ప్రెస్టన్ గ్రోవరుతో) మాట్లాడుతూ జపానుకు వ్యతిరేకంగా ఈ క్రిందిభావాలను వెల్లడించాడు. "జపాను భారతదేశంలో ఉండనివ్వాలని నాకు ఏకోశంలో కూడా లేదు. ముమ్మాటికిలేదు. ఎందుకంటె భారత స్వాతంత్ర్యం ఒక్కభారతదేశానికేగాక, చైనాకు మిత్రమండలికి కూడా అత్యవసరం."

జూన్ 28 వ తేదీ హరిజనలో వ్రాస్తూ "భారతదేశం తన ఆత్మహత్యకు దారి తీయనంతకాలం, చైనాకు నష్టకరమయ్యేట్టి, మిత్రమండలిని అపాయస్థితిలో పెట్టే ఏ పనినిగూడా చేయకూడదు."

గాంధీజీ జపానుకు వ్యతిరేకంగా ఇట్టి ప్రకటనలు చేస్తూ, మరియొక వైపు నిర్మాణ కార్యక్రమంలో ఉన్నవారందరూ బ్రిటిషు ప్రభుత్వానికి వ్యతిరేకంగా "అంతిమ" పోరాటంలో పాల్గొనడానికి తయారుగ ఉండాలని కోరుతున్నాడు. దీనికి కారణం ఏమిటి ? "భారతదేశానికి స్వాతంత్ర్యంరానిదే జపానును భారతీయులు ఎదుర్కొనరు. పైగా బలపరుస్తారు. దీనివల్ల భారతదేశానికి, చైనాకు కడకు మిత్రమండలికి కూడా ప్రమాదం" అని గాంధీజీ అభిప్రాయం. అమెరికను పత్రికా విలేఖరితోకూడా ఈ విషయాన్నే తెలియజేశాడు. "జపాను దాడిని నేను భారత ప్రజలు, బ్రిటిష్ ప్రభుత్వంపైగల అతివ్యాపిత అసంతృప్తి వలన, వ్యతిరేకించటం లేదు. కొంతమంది బర్మాదేశస్థులు పతనమయినట్లు, భారతీయులు కూడా జపానును బలపర్చే నీచస్థితికి రావచ్చునని నాభయం. కాని మేము విముక్తులమయిన అక్షణంలోనే మాస్వాతంత్ర్యాన్ని ప్రేమిస్తూ, దాని రక్షణ కోసం మా పూర్తి శక్తితో పోట్లాడే జాతిగా మారిపోతాం." భారతదేశానికి బర్మాకుపట్టినగతే పట్టకుండాచేయాలంటే భారతదేశానికి స్వాతంత్ర్యం సంపాదించాలి. దానికి అడ్డంవచ్చే బ్రిటిషు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పనిచేయాలి. అని గాంధీజీ వాదన.

బర్మాకు పట్టినగతి మనకు కూడా పట్టకుండా వుండాలంటే స్వాతంత్ర్యం కావాలని మేమూ అంగీకరిస్తాం. కాని భారతదేశ స్వాతంత్ర్యానికి మార్గంఏమిటి? బ్రిటిషు ప్రభుత్వ యుద్ధ ప్రయత్నాలకు పరోక్షంగానైనా అడ్డుతగిలే కార్యక్రమం మార్గంకాదు. అది జపాను ఆక్రమణకు అనుకూలిస్తుంది. స్వాతంత్ర్యానికి మార్గం జపాను దాడిని అరికట్టే ప్రతి ప్రయత్నాన్ని బలపర్చడమే నని మా దృఢ విశ్వాసం. బ్రిటిషు ప్రభుత్వం ఈరోజున భారతీయ ప్రజాసైన్యాన్ని తయారుజేయడానికి పూనుకోవటంలేదు. భారతీయ ప్రజాశక్తినంతా జపానుకు వ్యతిరేకంగా యుద్ధంలోకి తీసుకపోవడానికి కావలసన ప్రయత్నాలు చేయడంలేదు. కార్మికులు, రైతులు ఉత్పత్తిని ఎక్కువచేయడానికి తీసుకోవలసిన చర్యలు తీసుకోవడంలేదు. ఉత్పత్తిదారులకు ప్రజలకు మధ్యగల దుకాణదారులు, వర్తకుల అధికలాభాలను అర్జికట్టి ప్రజల కవసరమైన వస్తువులు తక్కువధరలకు సరఫరా చేయుటలేదు. ఈప్రయత్నాలన్నీ ప్రభుత్వంచేతచేయించడానికి కాంగ్రెసు పూనుకోవాలి. జపానుకు వ్యతిరేకంగా యుద్ధ ప్రయత్నాలను సర్వతోముఖంగా పెంపొందింపజేయడం ద్వారానే బ్రిటిష్ ప్రభుత్వం చేతుల్లోన్నుండి జాతీయ ప్రభుత్వాన్ని గుంజుకోగలం; ప్రజాసైన్యాన్ని నిర్మించగలం. జాతీయ ప్రభుత్వం. ప్రజాసైన్యం మనం స్థాపించుకో గల్గినప్పుడు ఇక సామ్రాజ్యవాదం యెక్కడవుంటుంది?

"నావుద్యమమం బ్రిటిష్ సైనికుల చలనానికి అడ్డుతగలలేదు. ఇంతవరకు మేము బ్రిటనుకు అడ్డు తగిలేపని ఏమీ చేయలేదు. ఇకముందు కూడ చేయం. కాని దానిని అవకాశంగా తీసుకొని బ్రిటను మా బానిసత్వాన్ని బలపర్చడానికి ప్రయత్నిస్తే మేము ఊరుకోం. నాస్వాతంత్ర్యాన్ని పోగొట్టుకొని (8వ పేజీలో)

ప్రజాశక్తి

1-7-'42 బుధవారం

కమ్యూనిస్టుల విడుదల - ప్రభుత్వ వైఖరి

ప్రచండ వాయువేగంతో పరిస్థితులు పరుగెత్తుచున్నా ప్రభుత్వంలో చలనం లేదు. నిరంతర ప్రజాందోళన ఫలితంగా యెట్టకేలకు 89 మంది డిటెన్యూలను విడిచిపెట్టింది. ఐనా యింకా సంకోచం - సందేహం పట్టి పీడించుతుంది. విడుదలైన వారిలో కొందరిపై పెట్టిన షరతులే యిందుకు నిదర్శనం.

దక్షిణ దేశంలో జీవానందం, యెలాంగో, ఫ్రాన్సిస్ గార్లను రాష్ట్రంనుండి నిర్గమించుడని ఉత్తరువు. ఇదివరకే విడుదలైన నాగిరెడ్డి గారిని తన జిల్లా కదలరాదని నిషేధము. ఏజన్సీ ప్రాంతంలో అడుగు పెట్టరాదని కోదండ రామయ్యగారికి ఆర్డరు. తమ నివాసస్థలాలను నెలకొకసారి తెలియ బరచే షరతుపైన మలబారు డిటిన్యూలను 31 మందిని విడుదల. ఇదీవరుస.

నేను, మద్రాసు రాష్ట్రంలోని 166 గురు డిటెన్యూలలోను 89 మంది మాత్రమే విడుదలయ్యారు, యస్. వి. ఘాటే, ఎ.యస్. కె. అయ్యంగార్, యం ఆర్ వెంకటా్రమన్, అల్లూరి, చంద్రోత్ మొదలగు ప్రధానకమ్యూనిస్టునాయకులింకా ఇనుప కవాటాలమధ్యనే క్రమగ్గుచున్నారు.

కోయల్పట్టి, మద్రాసు కుట్రకేసులలో కొందరికి మాత్రమే విడుదల అవకాశం లభించింది. కుమార మంగళం మొదలగువారిని విడిచిన పిమ్మట కేరళీయన్‌ను నిర్బంధించుటలో అర్ధమేమిటి? హనుమంతరావు (ఆంజనేయులు) పై కేసును ఉపసంహరించుకొన కుండుటలో అంతరార్థ మేమిటి?

ఇంతే గాదు, మొరాజా, ముత్తనూరు, కయ్యూరు కేసులలో శిక్ష పొందిన రైతు యువకుల నాయకు లున్నారే; వారి మాటేమిటి? వీరిలో కయ్యూరు శిక్షితుల అపీలు హైకోర్టులో వుంది. వీరిలో 5 గురు మరణ శిక్షకు గురికావలెనని క్రింది కోర్టు శిక్ష విధించినది. కె. పి. ఆర్. గోపాలన్‌కు మరణ శిక్ష రద్దయినా, అతనికి, మరి యిరవైమంది పైనున్న యావజ్జీవ శిక్ష రద్దు కాలేదు. ఈ రైతు బిడ్డల జీవాలు బంధిఖానాలకే అర్పితం కావలసిందేనా?

కోయంబత్తూరు కుట్రకేసు విడుదల ప్రస్తావనయే లేదు. అనేక కేసులలో శిక్షితులై బళ్ళారి, కన్ననూరులలో కారాగారవాస మనుభవించుచున్న వారి మాట తలపెట్టనే లేదు.

కమ్యూనిస్టు నాయకు లెందరో యింకనూ అందరు గ్రౌండ్‌లో (కనపడకుండా) వుండవలసి వచ్చింది. ఆంధ్ర దేశంలో సుందరయ్య, రాజేశ్వరరావు, చంద్రశేఖరరావు, యింకా మరికొందరు జిల్లా నాయకులపైన - మలబారులో శంకర నంబూ ద్రిపాద్ మొదలగు వారిపై డిటెన్షన్ ఆర్డరు రద్దుకాలేదు. వారిపై ప్రకటించిన బహుమతులను రద్దుచేసికొనలేదు. జైళ్లలో మ్రగ్గడంకన్న బయట ఫాసిస్టు వ్యతిరేక ఉద్యమంలో తమసర్వస్వాన్ని ధారపోయడానికి జైళ్ళనుండి తప్పించుకు వచ్చిన యోధులెందరిపైననో వారంట్లు అలాగే నిలిచి వున్నాయి. వీటిని రద్దు చేయకుండుటలో ప్రభుత్వ వైఖరిని యేమనుకోవాలి?

ప్రపంచ ప్రజా యుద్ధ సైనికులలో శిలగాత్రుల సహాయార్థం, రక్త నిధి (బ్లడ్ బాంక్)కి తమ రక్తాన్ని కూడ త్యాగం చేసి, ఫాసిజం పట్ల తమ యభిప్రాయ మేమిటో స్పష్టపరచినా బళ్ళారి కన్ననూరు జైళ్ళలోని కమ్యూనిష్టులు శృంఖలాబద్ధులై యుండమనియేనా ప్రభుత్వ వాంఛ?

ప్రభుత్వానికి యీ అంధ పంథా పనికిరాదు. ప్రజలకు దూరమై, ప్రజా సానుభూతి సహకారాలు లేని ప్రభుత్వం యే రంగంలోను విజయాన్ని సంపాదించలేదు. తమ ప్రియ నాయకులను - తమ బిడ్డలుగా, బంధువులుగా, ప్రేమించుకొనే ఉత్తమ వీరులను వదలనిదే పిచ్చి పిచ్చి ఆర్డర్లను రద్దు చేయనిదే ప్రజలు యుద్ధోన్ముఖులు కాజాలరు. సంకోచం - సంశయం - ప్రబలుతుంది. సర్వతోముఖమైన, సమగ్రమైన జాతీయ ప్రతిఘటనకు ప్రజలను సమీకరించాలంటే, ఇపుడు బయటికి వచ్చిన వారలే చాలరు. అందరూ రావాలి! అందరూ కావాలి!! నిర్బంధాలు, నిషేధాలు తొలగిపోవాలి!!!

విడుదల విషయం యిలా వుంటే, అక్కడక్కడ ప్రభుత్వం గావించే పిచ్చి పనులు ప్రజా సానుభూతిని కోల్పోయేటట్లు గావించుతున్నాయే.

ఒకప్రక్క ప్రభుత్వమే పంజాబు విద్యార్థుల నాహ్వానించి మిలిటరీ డ్రిల్లు చెబుతుంటే, ఈ రాష్ట్రంలో అలాంటి పనిచేయకుండా వుండటం అలా వుంచి, తూర్పు గోదావరిలో విద్యార్థి సంఘ ఆధ్వర్యం క్రింద జరిగే డ్రిల్లు వ్యాయామాలను నిషేధించింది. అక్కడక్కడ స్థానిక పోలీసులు గావించే దుండగీడుతనాలు కూడ ప్రజల ద్వేషాన్ని ఇనుమడింపజేస్తున్నాయి. తూర్పు గోదావరిలో ప్రజా సేవకుల సంచులు సోదా చేయడం, కమ్యూనిస్టులను తిట్టడం, ఫాసిస్టు వ్యతిరేక సభకు వచ్చేవారి నాహ్వానించుచున్న వాలంటీరుపై హంటరు ప్రయోగం, వచ్చే కూలీలను చెదరగొట్టడం, ర్యాలిలో సూర్యనారాయణ రాజుగారి యిల్లూ, నిడమ్రులో దత్తుగారి ఇల్లూ, ఆచంటలో మృత్యుంజయుడుగారి యిల్లూ సోదా చేయడం ఇవన్నీ ప్రభుత్వపు తెలివితక్కువతనాన్ని తెలియజేస్తున్నాయి. ఇలా కొనసాగాల్సిందేనా?

కూడదు. డిటెన్యూలను, ఖైదీలను విడుదల చేసితీరాలి. షరతులన్నీ రద్దు చేసుకోవాలి. తమ నాయకులను - తమ ప్రియ సేవకులను తమలోకి తెచ్చుకోవలసిన బాధ్యత ప్రజలది. ఫాసిస్టు దండయాత్ర కొనివచ్చే భీభత్సంనుండి ప్రజలను తప్పించడానికి - అసలా దండయాత్రనే తరిమివేయడానికి - ఉద్వేగం, ఉత్తేజం, హుషారు, నిచ్చే ఫాసిస్టు వ్యతిరేక ఖైదీలందరూ విడుదల గావాలి.

జూలై 7 వ తేదీ

చైనా జాతీయ దినోత్సవం జరపండి!

1937 జులై 7 వ తేది జాతీయ చైనా చరిత్రలో అతి ప్రాముఖ్యమైన ఘట్టము. ఆ రోజున తమ దేశాన్ని జపాను ఫాసిస్టు దురాక్రమణనుండి రక్షించుకొని తమ స్వాతంత్ర్యాన్ని నిలబెట్టుకోవడానికి ప్రజ లందరూ - ఐక్య కంఠముతో ప్రతిన బూనారు. సంపూర్ణ జాతీయైక్యతను నెలకొల్పారు. అప్రతి హతమైన జాతీయ ప్రతిఘటనను అప్పటినుంచీ యీరోజువరకు సాగిస్తూ జపాన్ ఫాసిస్టుల దురాక్రమణను జయప్రదంగా, వీరోచితంగా యెదుర్కొంటున్నారు.

1931 లో జపాను దుండగీడులు మంచూరియాపై పడ్డారు. అచ్చట వున్న జంగ్ - కై - షేక్ సైన్యాలు పోరాటములేకుండానే వెనుక్కు మరలివచ్చాయి.

ప్రభుత్వ సైన్యాలు పోరాడకపోయినా దేశ భక్తులైన కొందరు ప్రజలు ఫాసిస్టు జపానును ప్రతిఘటించారు. చిరస్మరణీయమైన ఆ ప్రతిఘటన ఫలించలేదు. మంచూరియాలో హాల్ రాష్ట్రాలు జపాను ఆక్రమించుకుంది

1937 జులై 7 వ తేదీనాటికి పై పరిస్థితులు తలక్రిందు లయ్యాయి జంగ్-కై-షేక్ జపానుకు లొంగిపోయే విధానం అవలంభించడం, జపాను దురాక్రమణను జయప్రదంగా యెదుర్కోవడానికి జాతీయైక్యత నెలకొల్పాలని ప్రచారం గావిస్తున్న కమ్యూనిష్టులను దునుమాడడం, దేశ భక్తులలోను, జాతీయ భావము గల జంగ్-కై-షేక్ సైన్యాలకు అసంతృప్తి గల్గించాయి. కమ్యూనిష్టుల ప్రచారంపై దేశమంతటా సానుభూతి హెచ్చింది. దీనికి తార్కాణము, ఉత్తరచైనా సైన్యాధిపతియైన చాంగ్-హ్యూ-సియాన్ కమ్యూనిష్టులతో పోరాడటానికి నిరాకరించి, కమ్యూనిష్టులను దునుమాడడానికి స్వయంగా అక్కడికి వెళ్ళిన జంగ్-కై-షేక్‌నే సియాన్ ప్రాంతములో బందీగా పట్టి కమ్యూనిష్టులకు అప్పజెప్పడం. (1936 డిసెంబరు) తన సైన్యంలోనే వచ్చిన చారిత్రాత్మకమైన యీ మార్పు జంగ్-కై-షేక్ కళ్లు తెరిచేటట్లు చేసింది. కమ్యూనిష్టులతో రాజీపడి జాతీయైక్యతను నెలకొల్పడానికి జపానును ప్రతిఘటించడానికి జంగ్-కై-షేక్ అంగీకరించాడు. అంతః కలహం అంతమైంది. సంపూర్ణ జాతీయైక్యత చేకూరి జాతీయ సమర ప్రయత్నాలు తీవ్రపర్చబడ్డాయి.

ఈ జాతీయైక్యతను పరీక్ష చేయడానికి, దానిని విచ్ఛిన్నం చేయడానికి జపాను ఫాసిస్టులు తమ మిలిటరీ యంత్రాన్ని ప్రయోగించదలిచారు. ఆ ప్రయత్న ఫలితంగానే 1937 జులై 7 వ తేదీన ఉత్తర చైనాలోని హ్యూపే రాష్ట్రంలోని మార్కోపోలో బ్రిడ్జిపై తీవ్రమైన దాడి గావించారు. దీనితో చైనాలో యేర్పడ్డ జాతీయైక్య ప్రతిఘటన విచ్ఛిన్నమైపోయి, జంగ్-కై-షేక్ సైన్యాలు యెప్పటివలెనే వెనక్కి మరలిపోతాయని జపాను ఫాసిస్టులు ఆశించారు. కాని తద్వ్యతిరేక పరిస్థితు లేర్పడ్డాయి. జాతీయైక్యతా బలము వలన గలిగిన నూతన వుత్సాహముతో చైనా ప్రజలు ప్రభుత్వ సైన్యాలు జపాను దురాక్రమణను అకుంఠిత ధైర్యంతో యెదుర్కొన్నాయి. ఈ ఐక్య ప్రతిఘటనా ఫలితంగా జాతీయ చైనాలోను, ఆక్రమిత చైనాలోను ఇంతకుముందు వ్యాపించి యున్న నిరుత్సాహం, నిస్సహాయం తొలగిపోయాయి; నూతన ప్రతిఘటనా శక్తి, సమరోత్సాహం, సర్వత్రా గలిగింది. జపాను దుండగీడులను దునుమాడాలనే అచంచల దీక్ష ప్రబలింది. జులై 7 వ తేదీలో చైనా జాతీయ ప్రతిఘటనా శక్తిలో యీ చరిత్రాత్మకమైన మార్పు గలిగింది. అందుచేత ఆరోజు చైనా కంతటికి జాతీయ పర్వ దినము.

జూలై 7 వ తేదీ ఒక్క చైనా ప్రజలకేగాక, జపాను దురాక్రమణకు గురి యైనట్టి దాని ప్రమాదాన్ని ఎదుర్కోవలసినట్టి తూర్పు దేశాలన్నిటికి పర్వ దినం. తూర్పు దేశాల ప్రజ లందరూ, ముఖ్యంగా భారత దేశం, ఈ చైనా దినోత్సవాన్ని జయప్రదంగా జరపాలి. జపాన్ ఫాసిజాన్ని యెదుర్కోవాలని ఐక్య కంఠంతో చైనా ప్రజలు పూనిన శంఖారావం భారత దేశంలో మూల మూలల జూలై 7 వ తేదీన మారుమ్రోగేటట్లు చెయ్యాలి! చైనా ప్రజలకు, భారత ప్రజలకు మరింత సన్నిహితత్వం నెలకొల్పాలి.

ఒక్క వూరేగింపులు, బహిరంగ సభలు జరపడంతో మన కర్తవ్యం పూర్తికాదు. జపాను ఫాసిస్టు సైన్యాలను జయప్రదంగా ప్రతిఘటించాలంటే, చైనా ప్రజలు అవలంబించిన ప్రజా పోరాట విధానమొక్కటే సరియైనదని గత 5 సంవత్సరాల చైనా పోరాట చరిత్ర రుజువు చేసింది, భారత దేశం ఫాసిజాన్ని నాశనం చేసి తద్వారా స్వాతంత్ర్యాన్ని నెలకొల్పుకోడానికి అట్టి ప్రజా పోరాటానికి తయారు కావాలి. భారత దేశంలో, ఆంధ్ర రాష్ట్రానికి తక్షణ ప్రమాదం వుంది. అందుచే జూలై 7 వ తేదీ చైనా దినోత్సవం జరపడం ద్వారా ఆంధ్ర ప్రజలు సర్వతోముఖ ప్రతిఘటనా సంసిద్ధతను తెలియజేయాలి.

చలసాని వాసుదేవరావు,
యమ్. రాధాకృష్ణ.

ఫాసిస్టు వ్యతిరేక గేయాలు కావాలి!

వివిధ జిల్లాలలో ప్రచారంలోనున్న ఈ గేయాలన్నిటిని ఒక పుస్తకరూపంగా ప్రచురించిన,జపాను వ్యతిరేక ఉద్యమానికెంతో ఉపకరిస్తుందనే ఉద్దేశంలో మేమట్టి ప్రయత్నానికి పూనుకున్నాం. కనుక రచయితలు, ఇతర రాజకీయ ప్రచారకులు తమవద్దనున్న ఫాసిస్టువ్యతిరేక గీతాలను జులై 7 కల్లా మాకు పంపకోరెదము. జులై రెండో వారంలో పుస్తకాన్ని ప్రచురిస్తాం.

చలసాని వాసుదేవరావు.
ఆంధ్ర ఫాసిస్టువ్యతిరేక ప్రచురణ కేంద్రం

సందేశాలు

మీరు 'ప్రజాశక్తి'ని తీసుకువస్తున్నారని విని చాలాసంతసిస్తున్నాను. మీప్రయత్నంలో అన్నివిధాలా మీకు విజయం కలగాలని వాంఛించుతున్నాను.

చరిత్ర మనకు గొప్పబాధ్యతను అప్పజెప్పింది. ఫాసిస్టు వ్యతిరేకుడయిన ప్రతివానికీ ప్రజాస్వామ్యాన్ని కోరే ప్రతివానికీ- ప్రతి దేశభక్తునకూ- మర్యాదస్థులయిన ప్రతి స్త్రీ పురుషునకూ- ఇది పరీక్షాసమయం. ఘనం మన కర్తవ్యాన్ని నెరవేర్చడానికి వెనుదీయరాదు. జపాను దాడిని ప్రతిఘటించడానికి ఈ దేశ ప్రజలను ఉత్తేజపరచాలి, అప్రతిఘటనాక్రమంలోనే మన దేశపు సంకెళ్ళన్నిటినీ బ్రద్దలు చేయాలి.

మీ పత్రిక తన కర్తవ్యాన్ని సరిగా నిర్వహించితే - ప్రతిఘటన అంతటికీ మొదట అవసరమైన ఫాసిస్టు వ్యతిరేక చైతన్యాన్ని స్వాతంత్ర్య ప్రియ చైతన్యాన్ని, అది ప్రజలలో కలుగ జేసినట్టయితే, మన అందరి సాధారణ కర్తవ్యంలో తన భాగాన్ని అది నెరవేర్చినదౌతుంది. మనము ఇన్నాళ్లూ దేనికోసం పోరాడేమో- దేనికోసం బాధ పడ్డామో- ఆ దేశ స్వాతంత్ర్యంకోసం సాయుధులమయే సమయం ఇపుడు వచ్చినందులకు విప్లవ యోధు లందరూ హర్షించాలి,

మీ సోదరుడు,
సోహన్‌సింగు జోష్,
యం. యల్. ఎ.
(పంజాబు కమ్యూనిస్టు నాయకుడు.)

★

ఆంధ్రదేశంలో ఫాసిస్టు- వ్యతిరేక వుద్యమాన్ని బలపరచడానికి, సమన్వయపరచడానికిగాను, ఆంధ్రకామ్రేడ్స్ ఒక తెలుగు వారపత్రికను తీసుకువచ్చారని విని నేనెంతో సంతోషించాను.

మనదేశ యావత్ చరిత్రలో కనివిని యెరుగని పశుప్రాయమైన తీవ్రదాడి జరిగే తక్షణ అపాయం మనదేశాన్ని ఎదుర్కొంటున్నది. జపాన్ దుండగీంద్ర ప్రథమదాడిని బహుశా అస్సాం బెంగాలుతోపాటు, ఆంధ్రదేశం ఎదుర్కొనే గౌరవం లభిస్తున్నది. అందుచే ఈనూతన అపాయాన్ని గుర్తింపచేయడానికి ఈజాతీయైక్యతను నిర్మించడానికి దురాక్రమణ గావించే శత్రువును వెనుదరిమే అప్రతిహతమైన వాంఛను రేకెత్తించడానికి, ఆంధ్రప్రజలను ఉత్తేజపరచడం మరింత అవసరం.

రానున్న విషమదినాలను ఎదుర్కొనడానికిగాను 'ప్రజాశక్తి'కి నా సోదర అభివాదాలను తెలియజేస్తున్నాను.

స్వాతంత్ర్యానికి విజయానికి ప్రజలను ముందుకుగొంపోయే శక్తికి-ప్రజాశక్తికి-నిజంగా ప్రాణచిహ్నంగా "ప్రజాశక్తి" పెంపొందవలెనని కోరుతున్నాను,

సోదర అభివందనాలతో-
మహమ్మద్ ఉజ్జాఫర్,
(నేషనల్‌ఫ్రంట్ సంపాదకులలో ఒకరు.)

★

సర్వతోముఖ జాతీయ ప్రతిఘటన పేరిట - మన మాతృభూమి స్వాతంత్ర్య యుద్ధంపేరిట - అఖిలభారత విద్యార్థి సంఘం, తూర్పుకోస్తా ప్రథమ శ్రేణి రక్షకులైన వీర ఆంధ్ర ప్రజల పత్రిక "ప్రజాశక్తి" కి అభివందనాలు తెలిపి జయ జయధ్వానాలు సల్పుతోంది.

విశాఖపట్టణం కాకినాడ అమాయక ప్రజల రక్తాన్ని తుచ్ఛ శత్రువు మొట్ట మొదటిసారి బలికొన్న ఈ భయానక విషమ సమయంలో, ప్రజల నుండి చాల దూరంగా విడిపోయిన బ్యురాక్రటిక్ సైన్యాలు మన దేశరక్షణ స్థానాలను జపాను 'ఫేసిస్టులకు' వదిలివేయుచున్న ఈ ఆపదకర సమయంలో-సర్వతోముఖమైన ప్రతిఘటనకు జాతీయ నాయకులు దేశాన్ని ప్రేరేపించకుండా ప్రజలను నిస్సహాయులు గాను, నిర్బలులు గాను వదిలి వేయుచున్న సమయంలో, మన తూర్పు సరిహద్దులను రక్షించుకోడానికై ప్రజలను ఉత్తేజపరిచేందుకు "ప్రజాశక్తి" బయలుదేరడం, మన విజయం కోసం గావించే పోరాటానికి మరింత కృత నిశ్చయాన్నీ ఆశనూ కల్గించుతుంది.

కామ్రేడ్స్, మనజాతీయ స్వాతంత్ర్యానికి తుచ్ఛమైన శత్రువుతో పోరాడటానికి శత్రువులను నిలబెట్టటానికి-తరిమివేయడానికి, మన స్వాతంత్ర్యయుద్ధం తూర్పు కోస్తా రక్షకవీరులను ఉత్తేజపరిచే అత్యున్నత గౌరవాన్ని-బెంగాల్‌లోని 'జనాయుధ' తోపాటు-మీపైన వుంచింది.

ఇప్పటి మనకున్న పరిస్థితుల ననుసరించి మీకున్న కష్టాలు అపూర్వమైనవన్నమాట నిజమే. అయినా ఆ కర్తవ్యం మహావీరోచితమైనది. ఆంధ్ర యుద్ధ సాంప్రదాయాలతో నిండిన మీరు, 'జనాయుధ'చే నడపబడిన బెంగాల్ కామ్రేడ్స్ తోపాటు- ఎట్టి శత్రువుకూడా అతిక్రమించ లేని అభేద్యమైన సర్వతోముఖమైన జాతీయైక్యతనునిర్మించెదరనిగట్టిగా విశ్వసించుతున్నాం. అట్టిఐక్యత ఒక్కటే మన జాతిని రక్షించి మన స్వాతంత్ర్యాన్ని తేగలదు.

కామ్రేడ్స్, తూర్పుకోస్తా సరిహద్దు రక్షకులారా! జాతీయ ప్రతిఘటనలో ఆంధ్ర కామ్రేడ్స్ ఈయనున్న నాయకత్వానికి మేము ఆతృతతో ఎదురు చూస్తుంటాం. దేశభక్తి- ఐక్యత- తీవ్ర కృషి- అనే ఈ నినాదాలతో ఎగురుతున్న స్వతంత్ర పతాకంతో, విజయానికి నడుస్తాం.

అఖిలభారత విద్యార్థిసంఘం 'ప్రజాశక్తి'కి సగౌరవంగా ప్రణమిల్లుతున్నది!

—పెరిన్‌బరూచా,
(అ. భా. విద్యార్థిసంఘ కార్యదర్శిని.)

★

ప్రజాశక్తికి అభివందనాలు. ఫాసిజంతో పోరాడటానికి, తద్వారా జీవితం కోసం, స్వాతంత్ర్యం కోసం, పోరాడటానికి ప్రజాశక్తి మన ప్రజల నుత్తేజపరచి సహాయం చేయుగాక!

హీరేన్ ముఖర్జీ,
అఖిల భారత సోవియట్, మిత్రమండలి
సంయుక్త కార్యదర్శి.

తాతగారి ధైర్యం ★ ★ ★

ఈ ఘటన జరిగింది మాస్కో సామీప్యంలోని 'లిపోత్కా' గ్రామంలో.

రష్యన్ సైనికుల ఒత్తిడివల్ల జర్మన్లు వెనక్కి పోవసిల వచ్చింది. జర్మన్లు తిరోగమనం చేసిన తర్వాత రాజకీయ బోధకుడగు 'ఇల్యాషెంకో' నాయకత్వం క్రింద నున్న రెడ్ఆర్మీ దళం ఆగ్రామంలో ప్రవేశించింది.

మొదటి ఇల్లు మండి పోతున్నది. ఇంటిచుట్టూవున్న మంచు అంతా మసితో నల్లగావుంది. నిర్మానుష్యంగా వున్న వీధిలో జర్మన్ల శవాలు చిందరవందరగా పడివున్నాయి.

సోవియటు సైన్యాలు జాగ్రత్తగా, ప్రతి అడుగు అడుగునా పరీక్షించుతూ ముందుకు సాగాయి. మొదటి మూడు ఇండ్లూ గడిచేసరికి నాల్గవ ఇంటి పెరటి నుండి రెడ్ఆర్మీ దళంవైపుకు హఠాత్తుగా మెషిన్‌గన్ తుపాకిగుండ్లు దూసాగాయి. మనవాళ్ళిద్దరు మంచులో పడిపోయారు.

'ఆయుధాలు క్రింద పెట్టండి!' అని కాసిందాడు ఇల్యాషెంకో.

కాని మెషిన్‌గన్ ఇంకా ప్రేల్చుతూనే వుంది. తుపాకిగుండ్లు మంచును బేధించుకుంటూ వారిచుట్టూ పడసాగాయి. నెత్తిమీదగుండా రివ్వుమంటూ దూసుకుపోయాయి. దగ్గరగా ఎక్కడో జర్మనీవాడు దాక్కొన్నాడు. రెడ్ఆర్మీ సైనికుల్ని వాడు చూడగల్గుతున్నాడు. కాని అతడు వారికి కన్పించడంలేదు. జర్మన్లు తిరోగమనం చేసేటప్పుడు గ్రామాలలో విడిచిపెట్టే "ఆత్మహత్య" దళానికి చెందిన వాళ్ళలో వీడు ఒకడై వుండాలి.

తకామని ఒక నిశ్చయానికి వచ్చి ఇల్యాషెంకో మరి ముగ్గురుతో కలిసి, నాల్గవ ఇంటి కంచెవైపుకు ప్రాకడం మొదలెట్టారు. ఆకంచె వెనుకనే మెషిన్‌గన్ దాగివుంది. మళ్లా ఇంకొకడు మనవాడు పడిపోయాడు- గాయపడ్డాడు.

ఇల్యాషెంకో మెల్లిగా ప్రాకాడు. కంచె దూకబోయేసరికి మెషిన్‌గన్ పేల్చడం మానివేసింది.

మెషిన్‌గన్ మళ్లా కాల్చడం ప్రారంభిస్తుందేమో నని మనవాడు ఆగాడు. కాని అది నిశ్శబ్దంగా వుంది. తలయెత్తిచుట్టూ చూశాడు. అతని కళ్ళు కంచెమీదుగా తనవైపు చూస్తున్న తెల్లటి గడ్డము ముడుతలుపడ్డ చర్మమూ గల- తాత కళ్ళల్లోకి చూశాయి.

"అమ్మయ్యా! మీరు వచ్చారూ." అంటూ, మర్యాద సూచకంగా టోపీ తీశాడు తాత.

"ఇక్కడ నువ్వేం చేస్తున్నావు తాతయ్యా!" ఇల్యాషెంకో, ప్రశ్నించాడు

ముసలాడు నిశ్శబ్దంగా మెషిన్‌గన్ వైపు చూపించాడు. కంచె వెనుక మెషిన్‌గన్ వుంది. మెషిన్‌గన్‌తో పని చేస్తున్న జర్మనీవాడు చచ్చిపడివున్నాడు. వాడి నెత్తిమీద కంచెనుండి పీకిన అడవి కర్రగుంజవుంది. ఫేసిస్టు సైనికుడి బుర్ర పగిలిపోయింది; కట్టెలా బిగిసిపోయిన వాడిచెయ్యి ఇంకా మెషిన్‌గన్ పిడిని గట్టిగా పట్టుకొనే వుంది.

"అయితే వాడి పనిపట్టింది నీవేఅన్నమాట" ఇల్యాషెంకో నోటినుండి అకస్మాత్తుగా పై మాటలు వెలువడ్డాయి.

"ఆ, మరి ఎవరనుకొన్నావు......"

ముసలాడు సగర్వంగా జవాబుచెప్పాడు.

—"మాస్కోన్యూస్" నుండి.

ఫాసిస్టు ప్రళయాగ్ని

ఫాసిష్టు ప్రళయాగ్ని ప్రజ్వరిల్లినదండి
ప్రజలందరము మేలుకోవాలి,
తూర్పుదీవులమధ్య తలయెత్తిన జ్వాల
కాలాగ్నికీలలై నాలుకలు జాపినది
కనుమూసితే మోసమోయి- మనమిపుడు
కలిసి పనిజేయవలెనోయి
సింగపూర్ మలయాల మ్రింగివేసిన అగ్ని
రంగూన్‌పట్టణము రగిలించిన జ్వాల
మాతృభారతదేశ ప్రాచ్యభూములు మొదట
చవిచూచి ఒకసారి తరలిపోయినది ॥ఫా॥
ఎన్నిప్రాణులమ్రింగి యీ యగ్నిరగిలెనో
ఎన్నిజీవాలింక ఎగిరిపోవాలో
పచ్చిరక్తముపీల్చుఫాసిష్టురాక్షసుల
ప్రకలందరముగలసి ప్రతిఘటించాలోయి
ఆక్రమిత దేశాల ఆక్రందనాల్ విన్న
గుండెనీరై మనము కుమిలిపోతామోయి
దేశభక్తులనెల్ల దీసినది ప్రాణములు
సామాన్యజనులనుచెండాడివిడచినది॥ఫా॥
జాతిమత ద్వేషాలు జారవిడచి మనము
పల్లెపల్లెలకు మనముపయనమైపోయి
ఫాసిష్టువ్యతిరేక భావాలు రేకొట్టి
సామాన్యజనులకు చైతన్య మివ్వాలి
వీరరక్తము మనది వుడుకెత్తడములేద?
ఫాసిష్టుభూతమును పరిమార్చరారండి
పచ్చిరక్తమ్మపీల్చునోయి- యీ
ఫాసిష్టుభూతము ప్రాణముల
బలిగోరునోయి॥ఫా॥

— టి. కోటయ్య.

జాతి అంటే ఏమిటి?

"జాతి"ని కమ్యూనిష్టులు యిలా నిర్వచిస్తారు. "చారిత్రకంగా పరిణామం చెంది ఒకే భాష, ఒకే భూభాగం, ఒకే ఆర్థిక జీవితం, ఒకే మనస్తత్వం (ఇది వారి విజ్ఞానంలో (కల్చరులో) వెల్లడి అవుతుంది.) గల్గిన నిలకడగల ప్రజల కూటమియే జాతి."

ప్రజల కూటమి అన్నప్పుడు, ఒక మానవ తెగకు (Race) చెందిన వారని అర్థంకాదు. నేటి ప్రపంచ మందలి మనుష్యు లందరు మంగోలియను, ఆర్యన్, సెమిటిక్, నీగ్రో, రెడ్ ఇండియన్ అనే ప్రధాన మానవ తెగల నుండియే అభివృద్ధి చెందారు. యీ ఐదు ప్రధాన మానవతెగలను వారి అవయవ నిర్మాణంలోను, ముఖలక్షణాల ననుసరించి శాస్త్రజ్ఞులు విభజించారు. ఈ మానవ తెగలు, వేలకొలది సంవత్సరాలు పరస్పరం కలసిమెలసి పోయి ప్రస్తుత కాలపు మిశ్రమజాతులుగ ఏర్పడ్డారు. జాతియని మనం ప్రస్తుతం వుపయోగించే అర్థం మానవ పరిణామశైశవావస్థలోని పై చెప్పిన మానవ తెగలని కాదు. ఆ మానవ తెగలలోని ఆదిమ తెగలకు (Tribes) కూడ ఇది వర్తించదు. అనేక మానవ తెగలు, వాని ఆదిమ తెగలు పరస్పరం వలసపోయి చారిత్రకాభివృద్ధి చెంది ఆదునిక జాతులుగా ఏర్పడ్డాయి. ఉదాహరణకు, ఆధునిక ఇటాలియన్ జాతి, రోమన్లు, టూటాన్లు, ఎట్రూస్కన్లు, గ్రీకులు, అరబ్బులు ఇంకా ఇతర ఆదిమ తెగలు సమిశ్రమం వల్ల ఏర్పడింది. ఫ్రెంచి, జర్మను జాతులు కూడా ఇలాగే ఏర్పడ్డాయి. ఆధునిక అమెరికన్ జాతి యూరప్‌నుండి వెళ్ళిన ఇటాలియన్లు ఇంగ్లీషు, జర్మన్ వగైరాల సమిశ్రమంవలన ఏర్పడింది. ప్రస్తుత ఆంధ్రులు నివసించె ప్రాంతములోని ఆదిమ తెగలూ, ద్రావిడులు, ఆర్యన్లు, రాష్ట్రకూటులు, శాకులు, వీని సమిశ్రమంవలన ఆంధ్రజాతి ఏర్పడింది.

అందుచే జాతి అనే పదం చారిత్రకంగా పరిణామంచెంది ఏర్పడిన ప్రజల కూటమికి మాత్రం వర్తిస్తుంది.

అయితే చారిత్రకంగా ఏర్పడిన ప్రజల కూటము లన్నిటిని, జాతులని అనము. అలెగ్జాండరు, దరియస్, జెంగిజ్‌ఖాన్‌లు బ్రహ్మాండమైన సామ్రాజ్యాలు ఏర్పాటు చేశారు. భారతదేశంలో కూడ చంద్రగుప్త, అశోకుల మౌర్య సామ్రాజ్యం, సముద్రగుప్తుడు వగైరాల గుప్త సామ్రాజ్యం, బాబరు అగ్బరుల మొగలు సామ్రాజ్యం చారిత్రకంగా ఏర్పడ్డాయి. కాని అవి తాత్కాలిక మైనవి. ఒకానొక వ్యక్తి లేక రాజవంశంయొక్క జయాపజయాల ననుసరించి ఆ ప్రజా కూటములు ఏర్పడేవి లేదా విడిపోయేవి. వీటిని మనం జాతులని అనం.

జాతి అనే పదాన్ని తాత్కాలికంగా, బుద్బుద ప్రాయంగా ఏర్పడిన ప్రజాకూటములకు కూడ ఉపయోగించం. నిలకడల ప్రజాకూటమికే ఉపయోగిస్తాం.

బ్రిటిష్, ఫ్రెంచి, డచ్, బెల్జియం జపాను సామ్రాజ్యాలు యుద్ధానికి పూర్వం నిలకడ గల్గినవే. చారిత్రకంగా ఏర్పడిన ప్రజలకూటములే. అయినా ఆ సామ్రాజ్యాలను జాతులుగా ఎవరూ పరిగణించలేదు. జాతీయ ప్రజాకూటమి వేరు. రాజకీయ ప్రజాకూటమి వేరు. బ్రిటిషుసామ్రాజ్యం ఒక రాజకీయ కూటమి కాని అందులో అనేక జాతులున్నాయి. అందరూ వ్యవహరించే ఒకేభాష లేకుండా జాతిని ఊహించలేము. ఒక రాజ్యాంగంలో వివిధ భాషలుంటాయి. కాని వివిధ భాషలు మాట్లాడే వారంతా ఒక జాతిగా ఎప్పటికీ ఏర్పడరు. వివిధ భాషలు మాట్లాడేవారు కలసి నివసించడంగాని, కలసి ఒకే ఆర్థిక జీవనం గడపడం గాని, సన్నిహితత్వం సంపాదించడం గాని అసంభవం.

జాతికి అందరూ వ్యవహరించే ఒకే భాష వుండడం దాని ప్రధాన లక్షణాలలో ఒకటి.

భారత దేశంలో అందరూ ఒకే భాషను ఉపయోగించడంలేదు. అనేక భాషలున్నాయి. అందుచే భారత దేశం ఒకే రాజ్యాంగమైనా, ఒకజాతిమాత్రంకాదు.

సాధారణంగా ఒక జాతి ఒకే భాషను మాట్లాడుతుంది. కాని ప్రతి జాతికి ఒక ప్రత్యేక భాష వుండితీరాలని దీని అర్థం కాదు. అమెరికనులు, ఇంగ్లీషువారు, ఐరిష్‌వారు, ఆస్ట్రేలియన్లు ఇంగ్లీషు మాట్లాడుతారు. కాని వీరంతా ఒక జాతి అని ఎవరూ అనరు. అలాగే నార్వేజియన్లు, డేనులు, ఒకే భాష మాట్లాడుతారు. వీరిని కూడ ఒకే జాతి అని ఎవరూ అనరు. అందుచే ఒకే భాషను మాట్లాడేవారంతా ఒకే జాతి కాదు. కాని, ఒక్క భాషనుబట్టి మాత్రమే జాతిని నిర్వచించలేము.

భారతదేశమం దంతటా, ముస్లిములు సామాన్యంగా హిందూస్థానీని, తప్పొప్పులతో మాట్లాడుతారు. అంత మాత్రంచేత భారతదేశంలోని ముస్లిము లందరూ ఒకే జాతి అనడంలో అర్థం లేదు. అక్లే బెంగాలు ముస్లిములు, బెంగాలీ హిందువుల వలె బెంగాలీభాషనే మాట్లాడుతారు. అందుచే బెంగాలీ ముస్లిములను వేరే జాతిగ పరిగణించ రాదనే వాదన అర్థంలేనిది. అయితే బెంగాలు ముస్లిములు ప్రత్యేకజాతి యని మేమిచట వాదించుటలేదు. వారిభాష బెంగాలు హిందువుల భాష యొక్కటే కొబట్టి వారంతా ఒక బెంగాలీ జాతి అని చెప్పడానికి వీలులేదని మాత్రమే మావాదన.

హిందూస్థానీలో (హిందీభాషలో) మూడు ప్రధాన ఉపభాష లున్నాయి. పశ్చిమ హిందూస్థానీ, బీహారీ, రాజస్థానీ. యీ మూడు భాషలూ చాలాసామీప్యంగా ఉంటాయి. అయినా ఈ మూడు భాషలు మాట్లాడేవారూ మూడు వివిధజాతులుగా పరిగణించ బడుతున్నారు. అలాగే పంజాబులో పశ్చిమ పంజాబీ యని, తూర్పు పంజాబీ యని రెండు వుపభాషలున్నాయి. పశ్చిమ హిందూస్థానీ బీహారీకి యెంత భేదముందో, కొద్దిగనో గొప్పగనో పశ్చిమ పంజాబీ, తూర్పు పంజాబీలకు గూడా అంత భేదముంది. అందుచే పశ్చిమ పంజాబీని, తూర్పు పంజాబీలను మాట్లాడేవారిని కూడ రెండు ప్రత్యేక జాతులుగ పరిగణించవచ్చు. పశ్చిమ పంజాబీలు ముస్లిం మతానికి చెందినవారు తూర్పు పంజాబుకి చెందిన వారిలో అత్యధిక సంఖ్యాకులు సిక్కు, హిందూమతాలకు చెందినవారు.

ఒక్క భాషను బట్టియే జాతిని నిర్వచించలేమని చూచాం. అందుచే జాతికి కావలసిన తదితర ప్రధాన లక్షణాలేమిటో చూద్దాం.

ఒకజాతి చాల కాలం తరతరాలు కలసి మెలసి పరస్పర సంబంధాలు గల్గి నివసించడంవల్ల ఏర్పడుతుంది. తరతరాలు ప్రజలు కలసి నివసించాలంటే వారందరూ ఒకే ప్రాంతంలో ఉండాలి. ఇప్పటి అమెరికన్లు మొట్ట మొదట యింగ్లండులో నివసిస్తూ ఉండేవారు. యింగ్లీషు జాతికి చెందినవారే. కాని వారు అమెరికాకు వెళ్ళి నివసించ మొదలు పెట్టినప్పుడు క్రమంగా ఒక నూతన జాతిగా (అమెరికన్ జాతిగా) ఏర్పడ్డారు. నివసించే ప్రాంతాలనుబట్టి వివిధజాతులు ఏర్పడ్డాయి.

అందుచే జాతికిఉండవలసిన మరియొక ప్రధాన లక్షణం ఒకటి కలిసి నివసించడానికి కావలసిన ప్రదేశం.

ఆంధ్రులు తమిళనాడులో అనేక ప్రదేశాల్లో నివసిస్తూ వున్నారు. అచ్చటి ప్రజలలో వీరు పదోవంతు, కొన్ని స్థలాల్లో 5వ వంతు కూడ వున్నారు. కాని వీరు చెల్లాచెదరుగా తమిళుల మధ్య నివసిస్తున్నారు. ఒక జిల్లా అంతాగాని, తాలూకా అంతాగాని ఆంధ్రులొక్కరే నివసించేస్థలం తమిళనాడులో యెచ్చటా లేదు. వీరు నివసిస్తూ ఉన్న ఒక తాలూకా తీసుకున్నా, అచ్చట నివసించే తమిళులు వీరికన్నా 9 రెట్లు అధికంగా ఉన్నారు. వీరు ఆర్థిక జీవనంలోను, సంబంధాలలోను తమ యిరుగు పొరుగు వారైన తమిళులతో ఏకమయిపోయారు. కడకు భాషనుకూడ తమిళభాషనే ఉపయోగిస్తున్నారు. ఇట్టి ఆంధ్రులను విడిపోయే హక్కుగల ప్రత్యేక జాతిగ, పరిగణించలేము. కాని యీ ఆంధ్రులు తమ భాష, జాతీయ విలక్షణంతో (పెక్యూలియారిటీ) కూడుకున్నవి జ్ఞానాలను పెంపొందింప జేసుకోడానికి అవకాశాలు యేర్పాటు చేయాలసి వుంటుంది.

మలబారులో మోప్లాలుకొన్నితాలూకాలలో ఒకటిగా కలసి నివసిస్తూ ఉన్నారు. భాష అరబ్బు మయమైన మళయాళం జాతీయ స్వభావం, విజ్ఞానం, యితర మళయాళ ప్రజలనుండి విభిన్నమయింది. ఈ ప్రాంతాన్ని స్థానిక స్వపరిపాలనగల ఒక ప్రాంతంగా ఏర్పాటు చేయాలి. కాని విడిపోయే హక్కు గల ప్రత్యేక జాతిగ మాత్రం పరిగణించము. కారణం వీరి ఆర్థిక జీవనం, యితర మళయాళ ప్రజల ఆర్థిక జీవనంతో ఏకమైపోయింది.

పైన వుదహరించిన వానిలో ఒక భాష, ఒక ప్రాంతమేగాక ఒకే ఆర్థిక జీవనం గూడ జాతికి కావలసిన ప్రధాన లక్షణాలలో ఒకటి అని తేలుతుంది.

ఒకే ఆర్థిక జీవితం, ఆర్థికఐక్యత జాతికి ఒక ప్రధాన లక్షణం.

బూర్జువావర్గం అభివృద్ధి చెందక ముందు యిట్టి ఐక్యత ఉండేదిగాదు. కాకతీయుల నాటి ఆంధ్రులనుగాని, విజయనగర సామ్రాజ్యకాలపు నాటి ఆంధ్రులను గాని ఉదాహరణగా తీసుకోండి. అనేక చిన్నచిన్న రాజ్యాధీసులు, నాయకులు ఒండొరులతో పోట్లాడుకుంటూ ఒక దానిని మరి యొకటి దోచుకొనుచుండేవి. తాత్కాలికంగా ఏ ఒకరో ఇతరులను ఓడించి సామ్రాజ్యాన్ని స్థాపించినా అది ఆంధ్రులందరినీ ఒకటిగా తెగల్గినంతగా వ్యాప్తిచెందలేదు. ఒకవేళ కలపినా ఆ ఐక్యత రాజకీయ రంగంలో పరిపాలనా రూపంలో మాత్రముండేది. ఆ సామ్రాజ్యంలోని వివిధ రాజుల అస్థిరధోరణి వలన రైతుల గ్రామప్రజల ఔదాసీన్యత (తమదిగాదని పట్టించుకోక పోవడంవల్ల) ఒకే ఆర్థిక జీవనం యేర్పడక ముందే విచ్ఛిన్నమయిపోయేవి. నేటికి గూడా ఆంధ్రులు ఒకే ఆర్థికజీవితాన్ని కల్గి వుండడంలేదు. మొత్తం ఆంధ్రులలో మూడవవంతు ప్రజలు హైదరాబాదు సంస్థానంలో వున్నారు. సంస్థానేతరఆంధ్రులకూ,వీరికీ ఆర్థిక రాజకీయ సంబంధాలు లేక విడిపోయి వీరిరువురూ విడిపోయి వున్నారు. అలాగే మైసూరులోని ఆంధ్రులు గూడ.

పెట్టుబడిదారీ వర్గం అభివృద్ధి చెందే కొద్ది ఒకేభాషను మాట్లాడే ప్రాంతంలో రాకపోక సౌకర్యాలు శ్రమ విభజన పెంపొంది ఒకే ఆర్థికజీవం గల ప్రాంతంగా మారుతుంది. దానికి అడ్డం వచ్చే ప్రతి విషయాన్ని వ్యతిరేకిస్తూ పెట్టుబడిదారీవర్గం కృషిచేస్తుంది. అది జాతి కంతకూ లాభకరమని ఆందోళన చేస్తుంది. అందుచేతనే కమ్యూనిస్టులు, జాతులు పెట్టుబడిదారీ కాలములో యేర్పడ్డాయని చెప్పుతున్నారు. భవిష్యత్‌లో పెట్టుబడిదారీ విధానం అంతరించి దానిస్థానే సోషలిజం యేర్పడ్డప్పుడు యీ జాతులస్థానే ఒకే ప్రపంచ మానవజాతికి దారితీస్తుంది.

పెట్టుబడిదారీ విధానం అభివృద్ధిచెంది రాకపోక సౌకర్యాలు వృద్ధిచేసుకుంటూ పరస్పర ఆర్థిక సంబంధాలను, వుత్పత్తి విభజనలను ఒక ప్రాంతానికి మరియొకటి అనుబంధముగా యేర్పరచుకోవడమే, ఒకే ఆర్థికజీవితాని (కామన్ ఇకనామిక్ లైఫ్)కి అర్థం. ఈ ప్రయత్నానికి అనేక రాజకీయ కారణాలు అడ్డుపడవచ్చు. అట్టి అభ్యంతరాలు లేనిచో ప్రజలు తమ ఆర్థిక జీవితాన్ని తమ యిష్టమొచ్చినట్లు పెంపొందించుకోవడానికి వీలుంటే ఒకే భాషను మాట్లాడే ప్రాంతమంతా ఒకే ఆర్థిక జీవితాన్ని యేర్పరుచుతారు. అట్టి అడ్డంకు లున్నప్పుడు వాటిని తొలగించడానికి ఆందోళన చేస్తారు. ఆంధ్రరాష్ట్ర సంయుక్త కర్నాటక సంయుక్త మహారాష్ట్ర ఆందోళనలు సింధు, ఒరిస్సా బీహారు రాష్ట్రాలు యేర్పడడం దీనికి వుదాహరణలు. (మిగతా 5వ పేజీలో)

బెంగాల్ విద్యార్థుల ఆదర్శకృషి

ప్రజలకు సైన్యానికి మధ్య లియాజన్ పని (లియాజన్ పని అంటే ప్రజలకు, సైన్యానికి మధ్య సన్నిహిత సంబధాన్ని ఏర్పరచడం.) ద్వారా యుద్ధరంగంలోని సైనికులకు సహాయంచేయాలని " అఖిల భారత విద్యార్థిసంఘం నిశ్చయించింది. మన పల్లెటూరి జనాన్ని వారి ఇండ్లనుండి పశువుల మందలాగా ఇష్టం వచ్చినపుడు తరిమివేయవచ్చు ననుకొని, మిలటరీ అధికారులు పిచ్చెత్తిన 'ఆర్డర్లు' ఇస్తుంటే విద్యార్థులు ఏం చేయాలి? ఒక యావత్ ప్రదేశాన్ని 24 గంటలలోగా ఖాళీ చేయవలసిందని నిర్బంధంగా ఆర్డర్ చేస్తే మనం ఏమిచేయాలి?

ప్రజాసేవ చేయాలనే దేశభక్తి పూరిత మనో ధోరణులపై ఆధారపడి మన బెంగాల్ కామ్రేడ్స్ దానికి జవాబును కనుగొన్నారు.

"ఈ పిచ్చిసైన్యం తోను బురాక్రసీ తోను మన మేమీ చేయలేమని" నిస్సహాయతను ప్రేమించే వారందరూ ఈ కథ చదవండి. ఈ పిచ్చిసైన్యంతోనే ఈ బురాక్రసీతోనే ప్రతిదీ చేయవచ్చునని, ప్రజలనుండి గౌరవం, ఖ్యాతి ఆశీస్సులను పొందవచ్చునని, వారు తెలుసుకోనియ్యండి.

ఆకస్మిక ఉత్తరువు

'క' అనేపట్టణం వద్ద (మిలటరీ కారణాల వలన అసలుపేరు చెప్పడం లేదు-దానిని 'క' అని పిలుద్దాం.) అనేక గ్రామాలను మిలటరీ తీసుకొంటుందని, గ్రామస్థులు 24 గంటలలోగా నిర్బంధంగా ఖాళీచేసివెళ్ళిపోవలసి వుంటుందని దక్షిణ కలకత్తా జిల్లా విద్యార్థి సంఘానికి ఒకరోజున వార్తవచ్చింది. వివరాలు తెలియలేదు.

ఈవార్తవిని మేము నిర్ఘాంతపోయాం. గ్రామస్థుల దుస్థితి దలచుకొని మేము భయభ్రాంతుల మయాం. ఇంతకంటె కూడా ఈ పిచ్చిఛాందసపు ఆర్డరుపైన వచ్చేరాజకీయ వ్యతిరేక ధోరణులను గురించి భయపడ్డాం.

అక్కడికి తక్షణమే కొందరి విద్యార్థులను పంప నిశ్చయించాం. జిల్లావిద్యార్థి సంఘ కార్యాలయానికి ఉత్సాహవంతులయిన వర్కర్లును పిలిపించడానికి వార్తాహరులను పంపాము. దుకాణదారుల నుండి డబ్బు పోగుచేయ దానికి వెంటనే ఒక దళాన్ని పంపాము. గంటన్నరలో 25 రూపాయలు వసూలయినాయి.

జిల్లా విద్యార్థి సంఘ కార్యాలయంలో వర్కర్లు సమావేశమయ్యారు. పై గ్రామాలకు బయలు దేరడానికి ఒక దళాన్ని ఎన్నుకున్నారు.

క్రోధావేశులయిన రైతులు

మన వాలంటీర్లు ఆ ప్రదేశానికి చేరారు. క్రోధపూరితులైన రైతులు వారిని ముట్టడించారు. ప్రభుత్వాన్ని తిట్టారు. జపాను సహాయంతో ఈ సైతాన్ ప్రభుత్వాన్ని తొలగించాలని తిట్టి మాట్లాడే టంతదూరం పోయారు. ప్రభుత్వం ఈ ప్రజలనందరిని జపాను ఒడిలోకి తరుముతుందా? మేము వారితో ఎంతో భావహృదయంతో వాదించాం. ఖాళీచేయవలసిందని బ్రతిమాలుకున్నాం. రైతులు మండిపడి మాకు శాపనార్థాలు పెట్టారు.

ఇంతలోకి డిస్ట్రిక్టు మేజిస్ట్రేట్ వచ్చి ఉపన్యసించాడు. అల్లరిచేశారు, కేకలువేశారు. మేజిస్ట్రేటును తరిమి వెంటబడ్డారు.

పరిస్థితి ఎంత తీవ్రంగా పరిణమించిందో మేము అర్థంచేసికొన ప్రారంభించాం. ఖాళీచేయాలిసిన రైతులకు నష్టపరిహారం ఇవ్వవలసిందని కోరాం. మిలటరీ అధికారులు, పెడసరంగా ప్రవర్తించారు. సివిల్ అధికారులకు తా మేమి చేయాలో, ఏమి చేయకూడదో తెలియదు. చివరకు డిస్ట్రిక్టు మాజిస్ట్రేటు మా కోర్కె నంగీకరించాడు. నష్టపరిహారం క్రింద, "పర్చా" ఒకటింటికి, 20 రూపాయలు ఉచితంగా ఇవ్వడానికి అంగీకరించాడు. ఇంకా, ఖాస్‌మహల్ నుండి రైతులకు ఉచితంగా భూములను ఇస్తామని వాగ్దానం చేశాడు.

ఈ కోర్కెలను జయించిన పిదప, మేజిస్ట్రేటును, రైతులను ధైర్యంతో కలుసుకొని ఈ నష్టపరిహారాన్ని గురించి ఉచిత భూములను గురించి ప్రకటించమని కోరాం. కాని అతడు భయపడి, తిరస్కరించాడు. ఎలాగైతేనేం అతనిని మీటింగుకు తీసుకుపోయి, అతనిచే పై ప్రకటనను గావించాం.

తర్వాత మేం ఉపన్యసించాం, మేము మిలటరీ ఆర్డరును ఖండించాం. రైతులు తమకు కొర్కెలను సంయుక్తంగా ముందు పెట్టవలసిందని కోరాం. ఖాళీ చేయడం ఎందుకో అర్థంచేసి కోవలసిందనీ, సరియైన పంథాఆర్డరును వుల్లంఘించడం కాదనీ నష్టపరిహారం క్రింద భూమినీ ధనాన్ని అడగాలనీ మేము నచ్చజెప్పి ప్రార్థించాం.

మేముజయించాం

ఉచిత భూమి, డబ్బు ఇస్తామనే వాగ్దానం రైతులను కొంత వరకు శాంతింపచేసింది. డబ్బువెంటనే చెల్లించవసెందని వారు కోరారు. మేం ఈ కోర్కెలను మేజిస్ట్రేటుకు తెలియ జేశాం. అతను రైతులకు పంచిపెట్ట వలసిందని డబ్బుమీకు ఇచ్చాడు. మేము రైతుల వద్దకు పోయి, 'పర్చా' చూపించి డబ్బు తీసుకోమని అన్నాం. కొంతమంది ఆ కాగితాన్ని పోగొట్టు కొన్నారు. ఈ అవకాశం తీసుకొని, అక్కడవున్న ఆఫీసరు కొంతమందికి ఈ ఉచితధనం ఈయడంలో కష్టాలుకల్గించ ప్రయత్నించాడు. మేం తక్షణం వాళ్లకి కూడా చెల్లించవలసిందని పట్టుబట్టాం. రైతులు మా కోర్కెను బల పరచారు. పాపం, ఆ చిన్నఉద్యోగి లొంగిపోవలసివస్తుంది.

ప్రభుత్వానికి 'జో-హుకుం' వాలాలయిన కొందరుగ్రామస్థులు తమ జీవితమంతా వీరిని దుఃఖ భాజనులుగా చేసిన కొందరు- ఈ డబ్బునంతా తమ జేబులలో నింపుకోడానికి ప్రయత్నించారు. దగా 'పర్చా' లని తీసుకువచ్చి డబ్బడిగారు. డిస్ట్రిక్టు మేజిస్ట్రేటుకు మాపై ద్వేషం తెప్పించాలని తీవ్రంగా కనిపించేశారు. మేము వారిని ఎదుర్కొన్నాం. తగిన శాస్తి- అవసరమైతే హింసాయుతంగా- చేస్తామని బెదిరించాం. రైతులు మమ్మల్ని సమర్థించారు. పాపం, ఈ 'జోహుకుంవాలాలు' లొంగిపోవలసి వచ్చింది.

ఆవేశపూరితులైన కృతనిశ్చితులైన రైతుల ముందు- పరిస్థితిని ప్రశాంతంగా మేము చక్కపెట్టడమూ చూచి- అధికారులు నిస్సహాయులై పోయారు. ఈ సారి ప్రజలను మోసగించ లేక పోయిన తమ తొత్తులకు అధికారులు సహాయం చేయలేకపోయారు.

ఎలాగైతేనేం అంతా బాగానే జరిగింది. డబ్బు అందరికీ తృప్తికరంగా పంచిపెట్టబడింది.

మా విజయాన్ని ముగించడానికి జపాను దండయాత్రికులతో పోరాడవలసిన ఆవశ్యకతను గురించి ఉద్రేకపూరితమైన ఉపన్యాసా లిచ్చాం. మేము అధికారుల తెలివితక్కువను ఖండించాం. మన సుందరభూమిపై జపాను వాళ్ళు దండయాత్ర చేయదలచుకున్నారు గాబట్టి ఖాళీచేయడం అవసరమే నని వి శ దీ క రిం చి చెప్పాము. అంత తక్కువకాలంలో వెళ్ళిపొమ్మనడం, ధనసహాయం ఇవ్వననడం తప్పేనని—అయినా ఖాళీచేయడం అవసరమని తెలియజెప్పాం. మేము పై ఆర్డరుకు లొంగవలసిందని, ఎక్కువ వ్యవధి కావాలనే కోర్కెను—ధనము, భూమి నష్టపరిహారంగా ఇవ్వవలసిందనే కోర్కెను—తీర్చవలసిందని పట్టుబట్ట వలసిందిగా కోరాము. ఇలాంటి ఘటనలు మళ్ళా జరగకుండా వుండాలంటే, ఇదే మార్గమని మేము చెప్పాం.

ఈసారి మేం చెప్పేది జాగ్రత్తగా విన్నారు. మాపైన కేకలు వేయడానికి ఎవడూ సాహసించలేదు. మేము జాగ్రత్తగాను, దృఢంగాను, వారి కోర్కెలను సమర్థించడం, కష్టపడి పని చేయడమూ బహుశా మేమంటే సానుభూతి ఏర్పరిచి వుండవచ్చు. వారికి భూమిని, డబ్బును నష్టపరిహారం క్రింద ఇప్పించడంవల్ల, బహుశా మాలో వారికి విశ్వాసం ఏర్పడింది. బహుశా, మా రాజకీయ విజ్ఞప్తులలో, విశదీకరణలలో హేతువు కన్పించి వుండవచ్చు. తెలివితక్కువ ఆర్డరును జూచి వారిఅధికార్లను తిట్టారు. న్యాయమేకూడా కాని, మమ్మల్ని గాఢమైన కృతజ్ఞతా హృదయంతో అభినందించారు, మాముఖాలు కళకళలాడినాయి.

ఇంతలోకి మా కిసాన్‌సభ కామ్రేడ్సు మా పనులేమిటో నేర్పారు. కొంతమంది రాయి అనుచరులు అధికారుల తప్పును క్రమ్మివేయడానికి, అమాయక ప్రజలను 'పంచమాగదళం' అని నిందించడానికి అవకాశం తీసుకొన ప్రయత్నించారు. కాని త్వరలోనే, నిష్క్రమించారు.

విజయానంతరం

పైన చెప్పిన ప్రదేశమూ, తత్సంబంధమైన ప్రజా ఏమంత పెద్దది కాదు. ఎక్కువ అలస్యం లేకుండానే వారి కొత్త ఇండ్లకు ప్రయాణపు ఏర్పాట్లు జరిగాయి. కాని మేము మరి 12 గంటలు ఉన్నాం, అవసరమైనచోట చేయూత నిచ్చాం.

ఇలాంటి అనుభవం ఇదివరకు లేకుండా- ఆలోచించడానికి చర్చించడానికి అవకాశం లేకుండా- దేశభక్తి ఒక్కటి తప్ప మరేదీ మమ్మల్ని నడిపేది ఏమీ లేకుండా- 36 గంటలలో ఇలాంటి గొప్ప కార్యాన్ని నెరవేర్చగల్గాం.

—"స్టూడెంటు" నుండి.

(4 వ పేజీ తరువాయి)

జాతులు జీవిత పరిస్థితుల్లోనేగాక మానసిక తత్వాల్లో గూడ విభేదించుతాయి. ఈ మానసిక తత్వం వారి జాతీయ విజ్ఞానము (నేషనల్ కల్చర్) లోని ప్రత్యేకతల్లో వెల్లడవుతుంది. ఇంగ్లండు, అమెరికా, ఐర్లండులో ఒకే భాషను మాట్లాడుతున్నా విచ్ఛిన్న పరిస్థితుల్లో నివసించుతూ వుండడం వలన భిన్నభిన్న మానసిక తత్వాలుగలవారై మూడు ప్రత్యేక జాతులుగా యేర్పడ్డాయి. ఈ జాతీయ మానసిక తత్వానికేమరియొక పేరు 'జాతీయ స్వభావము' (నేషనల్ కేరక్టరు.) జాతీయ స్వభావము శాశ్వతమైనదికాదిదు జీవిత పరిస్థితులవల్ల యేర్పడ్డ జాతీయ స్వభావము ఆ జీవిత పరిస్థితులు మార్పుచెందినప్పుడు తప్పక మార్పుచెందుతుంది. అది మార్పుచెందుతూవచ్చినా యేకాలములో నైనా అది జాతికి ప్రత్యేక రూపం యిస్తూవుంటుంది. అందుచే జాతికి మరియొక ప్రధాన లక్షణం దాని జాతీయస్వభావము.

ఒక జాతీయ స్వభావమే ఒకజాతిని యేర్పరచడానికి చాలదు. రష్యాలో, అమెరికాలో, కాకేషియాలో, యిట్లే అనేక యితర ప్రాంతాల్లో నివసించే యూదులకు ఒకే జాతీయస్వభావముంది, కాని వారు వివిధ ప్రాంతాల్లో వివిధ భాషలను మాట్లాడుతూ విభిన్న ఆర్థిక జీవనాలను కల్గి యుండుటచేత యూదులు ఒకే జాతికాదు. రష్యా, అమెరికా, కాకేషియాలలోనియూదులు అచ్చటచ్చటి ప్రజలు యెట్టి రాజకీయ ఆర్థిక జీవితాన్ని గడుపుచున్నారో అట్టి జీవితములోనే పాల్గొంటున్నారు. ఆ విజ్ఞాన వాతావరణంలోనే వుంటున్నారు. ఈ పరిస్థితులు యూదుల జాతీయ స్వభావంలో తప్పక మార్పు తెస్తాయి. యూదులకు యీ పరిస్థితుల్లో గూడ మిగిలినది యేమైనా వుంటే అది వారి మతము. వారు పూర్వం ఒకే ప్రాంతానికి రావడం జాతీయ స్వభావాన్ని వెల్లడించే కొన్ని చిహ్నాలు మాత్రమే. అయితే శిథిలమౌతూవున్న మత కర్మకాండ మాటుమణుగుతూవుండే మానసిక తత్వచిహ్నాలు తమ జీవితములో చుట్టూ వున్న సామాజిక, ఆర్థిక, వైజ్ఞానిక వాతావరణానికన్న యెక్కువగా యూదులను మార్పు చేయజాలవు. జాతికి కావలసిన నాలు లక్షణాలలో ఒకేభాష, ఒకేప్రాంతం, ఒకేఆర్థిక జీవితం, ఒకే జాతీయ స్వభావం, వీనిలో ఏ ఒకటి లోపించినా అది జాతిగా యేర్పడజాలదు. ఈనాల్గు వున్నప్పుడే జాతి అని వ్యవహరించబడగలదు.

మ్యునిసిపల్ పనివారలు

బెజవాడ.

బెజవాడ మ్యునిసిపల్ వర్కర్సు షుమారు 1½ సంIIనుంచి చాలకష్టాలనుఅనుభవిస్తున్నారు. కష్టాలు నివారించమని అధికారులను ఎన్నిసార్లు కోరినా, వారు వీటిని నిర్లక్ష్యం చేస్తున్నారు. కార్మికుల కనీస కోర్కెలు యివి.

(1) ఇనస్పెక్టర్లు వర్కర్సు చేత తమ యిండ్లవద్ద స్వంత పనులు చేయించుకోడం. లంచాలకొరకు నిర్బంధించడం, నిరాకరించితే కక్షతో నాగాలువేయడం, సస్పెండు చేయడం.

(2) జీతాలు యింక్రిమెంటు యిస్తామని కమీషనరుగారు వాగ్దానము చేసినకూడ అమలు జరుపలేదు.

(3) మ్యునిసిపల్ కౌన్సిలు తీర్మానము ప్రకారం అధిక ధరలనుబట్టి రూపాయికి 0–4–0 కరవు భత్యం ఇవ్వాలి. అది ఇవ్వడం లేదు.

(4) గవర్నమెంటు రూలు నెం. 1046 (17 జూలై 1941) ననుసరించి అన్ని సెలవులు యివ్వలేదు.

(5) ప్రావిడెంటు ఫండు అమలు జరుపుతామని చెప్పి చేయడం లేదు.

(6) సీనియారిటీని గమనించరు.

(7) అకౌంటు కోడ్ ప్రకారం మనిషికి 40 దొడ్లు యివ్వడానికి బదులు 80—90 దొడ్లు నిర్బంధంగా బాగుచేయించుకున్నారు.

ఇవిగాక జన సంఖ్యనుబట్టి ఎక్కువ స్టాఫ్‌ను వేయడంలేదు. చేసేపనికి అనుకూలమైన దుస్తులు యివ్వడములేదు. వారి పిల్లలకు ప్రత్యేక స్కూల్సులేవు. వారుకాపురముండే పేటలలో నీటి సప్లయి, ఎలక్ట్రిక్ లైట్లు, రోడ్లు మరమ్మతులు సరిగా లేవు. రోజురోజుకు పరిస్థితులు విషమిస్తున్నాయి. ఈ పరిస్థితు లన్నీ ప్రభుత్వానికి, మ్యునిసిపల్ అధికారులకు తెలియజేయబడ్డాయి. వారు వెంటనే ఈ కనీసకోర్కెలను గుర్తించి పరిష్కరించ గోరుతున్నాము. లేకపోతే పనివారలు తప్పనిసరిగా సమ్మెచేసి తమ హక్కులను రాబట్టుకోవలసి వస్తుంది.

—భూపతి నాగభూషణం.

కాకినాడ.

జపాన్ యుద్ధఫలితంగా కాకినాడలో 600 మంది పడవపనివాళ్లు నిరుద్యోగులయారు. వీరంతా తమకు పనిచూపమని మున్సిపాలిటీ వద్దకు డిప్యుటేషను వెళ్లగా మున్సిపాలిటీ వారు 500 మందికి చెఱువుతవ్వుపని యిచ్చి పురుషుడికి 0-6-0, స్త్రీకి 0-4-0 చొII కూలి ఇవ్వడానికి అంగీకరించారు. కాని పనిముట్లు కార్మికులే తెచ్చుకోవాలన్నారు. తాకట్లుపెట్టి, విశేషవడ్డీలు యిచ్చుకుని ఎలాగో కూలీలు పనిముట్లుసంపాదించుకొని పనిచేస్తున్నారు. కొద్దిరోజులు గడిచాక చైర్‌మన్‌గారు, ఇంజనీరుగారు వచ్చి ఈరేట్లు చాలా హెచ్చుఅని, పురుషుడికి 0-4-0 స్త్రీకి 0-2-6 కంటె ఎక్కువ ఇవ్వమనిలేకుంటే పనిమానివెయ్యమని అన్నారు. మొదట ఒప్పుకున్న రేటును ఇప్పుడు ఇవ్వమని చెప్పడం చాల అన్యాయం. చట్టవిరుద్ధం. దీనివల్లఇప్పుడు 500 కూలీలకు తిండి లేకుండా పోతుంది. పైగా పనిముట్లకై చేసిన అప్పుబాధ ఎక్కువ అవుతుంది.

—యం. వి. వీరయ్య.

రైల్వే కార్మికులు

గుంతకల్ బ్రాంచి.

ది 21-6-42 తేదీని బళ్ళారి, హోస్పేట, ఓబులాపురం సెక్షనుల మహాసభ చిత్రగుంటలో కామ్రేడ్ యం. ముత్తుస్వామిగారి అధ్యక్షతను జరిగింది. అర్గనైజింగు సెక్రటరీ కామ్రేడ్ యస్.నారాయణస్వామిగారు, మిలిటరైజేషను స్కీమును గురించి, ప్రస్తుత యుద్ధములో రైల్వే కార్మికుల కర్తవ్యాన్ని గురించి విపులీకరించారు. ఈ క్రింది తీర్మానాలు చేశారు.

(1) ఈ క్రింద వుదహరింపబడిన కష్టాలను వెంటనే నిష్పక్షపాతమైన విచారణద్వారా తొలగించాలని రైల్వే యేజంటును కోరుచున్నాము.

(a) హోస్పేట యింజనీరింగు సెక్షనులో పనివారు శెలవు అడిగితే లీవు ఫారం 4 కాపీలు తీసుకురావాలని, లేనివారికి శెలవు యివ్వక అబ్సెంట్లు వేయడం.

(b) ఫిష్ ప్లేట్లు పూర్తిగా విప్పి నూనె వెయ్యాలని ఆజ్ఞాపించి, ఎ. ఇ. వచ్చి తనిఖీ చేసినపుడు తా నలా చెప్పలేదని అబద్ధమాడి 1, 4, 8, 9, 11, 13 గ్యాంగు కీమన్లను మామూలు గ్యాంగుమన్లుగా తగ్గించడం. మేస్త్రీలను తగ్గించి కీమన్లుగా వేయడం.

(c) 13 నెం. కీమన్‌ను ఇనస్పెక్టరు కొట్టి తిట్టి కొన్ని రోజులు అబ్సెంట్సు వేయడం.

(d) 1 నెం. గ్యాంగు మేస్త్రీ జబ్బుగా వుంటే 1, 2 గ్యాంగులను కలసి పని చేయమని చెప్పి, 16 మైళ్ళనుండి వచ్చేవారు 5 నిమిషాలు ఆలస్యమైనా అబ్సెంటు వేయడం మొదలైన నిర్బంధ చర్యలు.

(2) బళ్ళారిలో డి. ఎస్. కె. పనివారలకు శెలవు ప్యాసులు యివ్వకుండాను, 6 గురికి ఇవాక్యుయేషన్ అలవెన్సులు యివ్వకుండాను వుంచుతున్నారు. వెంటనే అలవెన్సును యివ్వాలనీ.

(3) ధరలు విపరీతంగా పెరుగుటవల్ల ఆలిండియా రైల్వే పనివారల సంఘం కోరినట్లు రూ. 150 లోపు జీతం వచ్చేవారందరికీ అధిక యుద్ధ అలవెన్సులు యివ్వాలనీ,

(4) గుంతకల్ డిస్ట్రిక్టులో షంటింగు జమాదారు పెస్టు ప్యాసైనవారు అనేకులుండగా పాయింట్సుమన్‌లకు బేక్సుపోర్టరు ఉద్యోగాలివ్వడం అన్యాయమనీ తీర్మానాలు చేశారు.

బెజవాడ బ్రాంచి.

యం. యస్. యం. రైల్వే పనివారల యూనియన్ అధ్యక్షులు, యస్. గురుస్వామిగారు వచ్చిన సందర్భంలో బెజవాడ బ్రాంచి ఆధ్వర్యాన రైల్వే ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ మైదానంలో బహిరంగసభ జరిగింది. 500 కు పైగా పనివారు వచ్చారు. గురుస్వామిగారు మిలిటరీ యూనిట్సు స్కీము గురించి చెబుతూ రైల్వే బోర్డు కాంక్షను చేసిన హక్కులు, యింకా దానికి సంబంధించిన యితర హక్కులు రాబట్టుకోడాన్ని గురించి ఉపన్యసించారు. తరువాత బ్రాంచి కార్యదర్శి రహింతుల్లాగారు ప్రస్తుత ఫాసిస్టు వ్యతిరేక ప్రజా యుద్ధంలో భారత రైల్వే కార్మికుల కర్తవ్యాన్ని గురించి ఉద్బోధించారు.

బెజవాడ బ్రాంచి ఆధ్వర్యాన, ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన మిలటరీ యూనిట్సు స్కీమును గురించి వివరించడానికి గాను గుడివాడలో ది 20-6-42 తేదీని కైకలూరు గుడివాడ సెక్షనుల పనివారల బహిరంగ సభ జరిగింది. బెజవాడ బ్రాంచి కార్యదర్శి రహింతుల్లా కామ్రేడ్ పోలేపెద్ది నరసింహమూర్తిగార్లు ఆస్కీమును గురించీ దాని లోటుపాట్లను గురించి ఉపన్యసించారు. ఈ క్రింది తీర్మానాలు ఆమోదించ బడ్డాయి.

1. బెజవాడ - బందరు మధ్యలైను మీద పనిచేసే ఇంజనీరింగు వర్కర్లకు ఇంతవరకు ఇవ్వకుండావుంచిన మూడు నెలల ఇవాక్యుయేషన్ అలవెన్సులు వెంటనే ఇప్పించవలెను.

2. రైల్వేపనివారందరికీ మిలిటరీ ట్రైనింగు ఆయుధాలను ఇవ్వాలి.

3. సావర్సు రాంకులో వుంచబడే పనివారలను కూడా మిలటరీ పదవులకు ప్రమోషను చేస్తూవుండాలి.

వ్యవసాయ కూలీలు

దివి తాలూకా కృష్ణాజిల్లా వ్యవసాయ కూలీ మహాసభ ది 20-6-42 తేదీన యెద్దనపూడిలో గరికపాటి వెంకటరత్నంగారి అధ్యక్షతను జరిగింది. 600 కూలీలు రైతులు పాల్గొన్నారు. ఈ తీర్మానాలు చేశారు.

(1) బస్తా యెన్ని రూపాయలు అమ్మితే కూలి రేటు అన్ని అణాలు వుండాలని దివి తాలూకా రైతు సభ పాగోలు తీర్మానాన్ని అమలు జరిగేటట్లు చూడాలనీ.

(2) స్త్రీ పురుషులకు సమానకూలి ఇవ్వాలనీ

(3) జమీందారి ప్రాంతాలలోని బంజరు భూములుకూడా సాగుకు మంజూరు చేయాలనీ.

(4) అధిక లాభాలు అరికట్టుటకు ప్రభుత్వం స్టోర్సుపెట్టి సరుకులు న్యాయమైన ధరలకు విక్రయించాలనీ.

(5) తెలుగు సంవత్సరంలో అధికమాసం వచ్చుటవలన జూన్ 1 నుండి మే 31 వరకు వ్యవసాయక సంవత్సరంగా ఏర్పాటు చేసుకోవాలని.

(6) మంగళాపురం ముఠాని కూలీల భూములను చల్లపల్లి ఎస్టేటువారు దురాక్రమణ జేయుటను నిరశించుతూ తీర్మానించారు.

• • •

తూర్పుగోదావరి జిల్లా వ్యవసాయ కూలీ సంఘ కార్యదర్శి రాపాక సూర్యనారాయణగారిలా వ్రాస్తున్నారు. తూII గోII జిల్లా వ్యవసాయకూలీ మహాసభ ఆగస్టు నెలలో జరుగుతుంది. జూలై నెలాఖరులోగా సభ్యులుగా చేరినవారే ప్రతినిధులను ఎన్నుకోడానికి వోటింగు కలిగి వుంటారు. చేర్చిన సభ్యుల జాబితాలు ఆగస్టు 10 వ తేదీలోగా "అంతర్వేదిపాలెం ఫిర్కా వ్యవసాయ కూలీ సంఘం ఆఫీసు, అంతర్వేదిపాలెంకు పంపాలి.

• • •

మద్రాసు ప్రభుత్వం జూన్ 17 వ తేదీని ఆహార దినుసులకోసం రైల్వే భూములను కౌలుకు ఇస్తారని ప్రకటించింది. అట్టిరైల్వే భూములను తిండిలేక మాడుచున్న వ్యవసాయ కూలీలకు కౌలుకు ఇవ్వవలసినదని కోరుతూ తూII గోII జిల్లా వ్యవసాయకూలీ సంఘ కార్యదర్శి రాపాక సూర్యనారాయణ, తూII గోII జిల్లాబ్రిగేడ్ కార్యదర్శి జి. బాలాజీదాస్ గార్లు ప్రకటించుతున్నారు.

• • •

రైతులు

కోపూరు తాలూకా రైతు మహాసభ 14-6-42 వ తేదీని తలమంచి గ్రామంలో, ఆర్.భరద్వాజ్‌గారి అధ్యక్షతక్రింద జరిగింది. ఆ సభాతీర్మానాలుకొన్ని ఇచ్చట పొందు పరచుచున్నాము.

(1) రాష్ట్ర ప్రభుత్వంవారు రైతులను యెక్కువ పంటలు పండించమని ప్రోత్సాహించుచున్ననూ, స్థానిక ప్రభుత్వోద్యోగ్యులు రైతులుపై పెనాల్టీలు వేయుచున్నారు. అలాంటి పెనాల్టీలు విధించకూడదని కోరుచున్నాము.

(2) ప్రభుత్వం బంజరు భూములపై మూడు సంII శిస్తులేకుండ సాగుబడిచేసుకోవచ్చునని ప్రకటించినారు. ఆభూములను ధనిక రైతులకు గాక బీదవారికి సాగుచేయుకుట ఇవ్వమని ప్రభుత్వం వారిని కోరుచున్నారు.

(3) పురిణి గ్రామములో అనాధీనంలో ఇండ్లుకట్టుకొని నివసించు నిమ్నజాతులుదానిని బిన్నం పెట్టి గ్రామనత్తం క్రిందమార్చించవలసినదిగా ప్రభుత్వం వారిని కోరుచున్నారు.

(4) తలమంచికాలువనుండి భోటుకాల్వ A చానల్‌లో దిగువ మిట్టభూములకు పారు నీటిని P. W. D. కాలువ కట్టను పై భాగములో తెగకొట్టి నెం 462/3 రు భూమికి ప్రత్యేక కాలువ క్రింద పారుదల యుండియూ A చానలు నుండి కట్టతెగకొట్టి అక్రమంగానీటిని పారించుటవల్ల ఆయకట్టులోని భూమికి నష్టం కలుగుచున్నది, గానకట్ట తెగకొట్టు పద్ధతిని మాన్పించి ఇకమీద అవిధముగా జరుగకుండునట్లు చూడవలసిందిగా ప్రభుత్వవారిని కోరుచున్నాము.

B మైకా ఛానల్‌నుండి తలమంచి కాల్వకు నీరుఇచ్చునపుడు ఇవ్వవలసిన నీటికన్న ఎక్కువ నీటిని ఇచ్చుచున్నామని P W D ప్రక్క కాల్వలు నీటిని అధికముగాలాగుటవల్ల తలమంచి గ్రామపొలములలో P W D కంట్రోలు గేజివద్ద మాదానూషా నీటిని చూపుటలేదు గాన మాఆయకట్టు మొత్తముకు రావలసిన నీటిని గేజిని చూపించి ఇచ్చునట్లుగా చేయవలయును అనికోరుచున్నాము.

విద్యార్థులు

గుంటూరు జిల్లా విద్యార్థి సంఘ కార్యదర్శి, జి. వెంకటేశ్వరావుగారిట్లు వ్రాస్తున్నారు:—

గుంటూరు జిల్లాలో బోర్డు పాఠశాల లన్నిటిలోను కమర్షియల్ యిన్‌స్ట్రక్టర్లను తొలగించి 4, 5 తరగతులు తీసివేస్తూ తీర్మానించారు. కాంగ్రెసు బోర్డే ఈ విధంగా చేయడం యుక్తం కాదు. బడ్జటులోని లోటును భర్తీచేసుకోడానికి, విద్యా విధానంలో ఒక ముఖ్యమైన కమర్షిల్ శాఖను తీసివేయనక్కరలేదు. ఇంతకంటె తక్కువ ప్రాముఖ్యతగల శాఖలు ఎన్నో వున్నాయి. ప్రపంచంలోని నిరక్షరాస్యులలో మూడోవంతు ఒక్క మన దేశంలోనే వున్నారు. ప్రజాప్రతినిధులైన కాంగ్రెసువారే ఇలాచేయడం అన్యాయం,

దీనికి పై మెట్టు

ప్రభుత్వంవారు అసలు జిల్లాబోర్డునే రద్దు చేసివేశామన్నారు, ఇట్టి చర్యలవల్ల యుద్ధ ప్రయత్నాలకు ప్రజల సహకారం సన్నగిల్లుతుంది. వారిలో అవిశ్వాసం ప్రబలుతుంది. కావున ప్రభుత్వం దీనిని గుర్తించి బోర్డురద్దు ఆర్డరును ఉపసంహరించు కోవాలని కోరుతున్నాను.

వీటికొరకు ఉద్యోగాలు పోయిన ఉపాధ్యాయులు, విద్యార్థులు, జిల్లాలోని ప్రజలు అందోళనగావించాలని కోరుతున్నాను.

ఫాసిస్టు వ్యతిరేక ప్రజా వుద్యమం

తూII గోII జిల్లా ఫాసిస్టు వ్యతిరేక యాత్రలు

తూర్పు గోదావరి జిల్లా బ్రిగేడ్ యాజమాన్యాన ఫాసిస్టు వ్యతిరేక దళం మే 24 న రామచంద్రపురం తాలూకా కపిలేశ్వర పురంలో 25 గురు మంది వాలంటీర్లు బయలుదేరి ఆ తాలూకాలోను, కొత్తపేట డివిజనులోను మొత్తం 116 గ్రామాలు, 250 మైళ్ళు కాలి నడకను సంచారం చేసి, బ్రిగేడ్ శిక్షణా తరగతులలో శిక్షణ పొందుటకై జూన్ 20 వ తేదీన రాజమండ్రి చేరిరి.

రాజమండ్రి బెటాలియన్ యాజమాన్యాన వేరొక దళం రెండు రోజులు 10 గ్రామాలు సంచారం చేసి ఫాసిస్టు వ్యతిరేక ప్రచారం సాగించెను.

పై ప్రచారంలో పూళ్ళ, ద్రాక్షారామ, రాయవరం, చిక్కవోలు, ఏడిద, అంగర, చింతలూరులలో సభలు, ఊరేగింపులు జరిగినవి. రామచంద్రపురంలో తాలూకా ఫాసిస్టు వ్యతిరేక మహా సభ, మండపేటలో జిల్లా ఫాసిస్టు వ్యతిరేక మహాసభ జరిగాయి.

ప్రచారక పద్ధతులు :

నినాదాలు, పాటలు, సమిష్టి సంగీతం, సులభమైన శైలిలో ఉపన్యాసము లిచ్చారు. సోవియట్ యుద్ధ చిత్రములను ప్రదర్శించుట బొబ్బిలి పాట స్టయిలులో ఫాసిస్టు వ్యతిరేక గీతం, ముఖ్య స్థలములలో గోడల మీద, అట్టలమీద నినాదాలు వ్రాసి వీధి మొదట్లో పెట్టుట, కరపత్రాలు పంచుట.

వాలంటీర్లకు శిక్షణ

ప్రతిరోజు స్కౌంటింగు, నూతన విషయాలమీద చర్చలు, గుణ పాఠాలు నేర్చుకొనుట, క్రమ శిక్షణను గురించి చర్చించుట,

ఉపన్యాసాలు

ప్రపంచ ఫాసిస్టు వ్యతిరేక ప్రచార పద్ధతులు, జపాను దాడిని యెలా యెదుర్కోవాలో, సోవియట్‌కు సానుభూతి, సహాయం, చైనా, రష్యా, గొరిల్లా యుద్ధ పద్ధతులు, ఫాసిస్టు అత్యాచారాలు, గ్రామ రక్షణ ఏర్పాట్లు, విమానదాడి రక్షణలు.

కుల తత్వవాదులు, హిందూ మత ప్రచారానికి ఒకే రోజు, ఒకే చోట సభ యేర్పాటు చేశారు కాని వారి యాశలు అడియాసలై ప్రజలచే తీవ్రంగా అవమానింపబడ్డారు.

మహా సభలు, సభలు

వ్యవసాయ కూలీ సంఘాలు అనేక గ్రామాలలో ఏర్పాటు చేయబడెను. రామచంద్రపురం, రాజోలులలో తాలూకా ఫాసిస్టు వ్యతిరేక మహా సభలు, మండపేటలో జిల్లా ఫాసిస్టు వ్యతిరేక మహాసభ దిగ్విజయంగా జరుపబడ్డాయి.

అనుభవాలు

ఈ వాలంటీరుల యాత్రలవలన ప్రజలు, కాంగ్రెసు హైకమాండు యొక్క నిస్తబ్ధత, జాతీయ, అంతర్జాతీయ సమస్యలు పూర్తిగా అర్థం చేసికోగ్గలారు, మన మీద చేసే దుష్ప్రచారాన్ని ఖండించి మన నిజమైన దృక్పథం తెలియజెప్పడమైనది. బీభత్స వార్తలకు స్థలం యివ్వకుండా నిజమైన వార్తలు చెప్పడమైనది. జపాన్, జర్మనీ ఫాసిస్టు అనుకూల ప్రచారం ఖండింపబడినది. ప్రజా యుద్ధం యెలాగైందో విపులీకరించడమైంది. అన్ని గ్రామాల్లో ప్రజా రక్షణ దళాలు యేర్పాటు చేసి, రాత్రి గస్తీ, ప్రథమ చికిత్స కేంద్రాలు యేర్పాటు చేయబడ్డాయి.

జి. యస్. బాలాజీ దాస్.

★

కోయిలకుంట్ల తాలూకా ఫాసిస్టు వ్యతిరేక మహాసభ.

కర్నూలు జిల్లాయందలి కోయిలకుంట్ల తాలూకా ఫాసిస్టు వ్యతిరేకమహాసభ చాకరాజు వేముల గ్రామమునందు మిక్కిలి జయప్రదముగా 20-6-42 సాయంత్రమున జరుప బడింది. జిల్లాకాంగ్రెసు సంఘాధ్యక్షులగు శ్రీయుత పిడతల రంగారెడ్డిగారు అధ్యక్షత వహించిరి, శ్రీయుత సి. పుల్లారెడ్డిగారు మహాసభను ప్రారంభించిరిజి, ల్లాకాంగ్రెసు సంఘ సంయుక్తకార్యదర్శియగు శ్రీయుత ఆర్. కె. రామలింగారెడ్డిగారు. జాతీయ పతాకము ఎగురవేశారు.

ఫాసిస్టుల దురాక్రమణలను, దుండగములను ఖండించుచు, జపాను దాడిని విజయవంతముగా నెదుర్కొనుటకు ప్రజాప్రభుత్వము ముఖ్యఅవసరమనియు, ప్రజాప్రభుత్వము నెలకొల్పువరకును ఒక కార్యక్రమమును దెలియపర్చుచు తీర్మానము గావించబడెను. పౌరసత్వపు హక్కులను దేశమున పునరుద్ధంచవలసినదనియు ఫాసిస్టువ్యతిరేకులగు రాజకీయఖైదీలను, డిటెన్యూలను ప్రస్తుత క్లిష్టపరిస్థితుల గుర్తించి వెంటనేవిడుదల జేయవలసినదనియు ప్రభుత్వము వారిని కోరుచు తీర్మానించిరి. ప్రస్తుతయుద్ధ పరిస్థితుల ఫలితముగా గల్గిన ఆర్థికదుస్థితిని వెల్లడించి, ఆప్రాంత రైతుల కనీసపుకోర్కెలు దెలియజేసి ఆహార పదార్థముల నెక్కువగా పండించుటకుగాను వాటి నీదేర్చవలసినదిగా ప్రభుత్వమును కోరిరి.

ఫాసిస్టుల దురాక్రమణను వీరోచితముగా ప్రతిఘటించుచున్న సోవియటు యెర్ర సైన్యమును, చైనా ప్రజా సైన్యమును మహా సభవారు అభినందించి, ఫాసిజమును రూపుమాపుటకు దేశీయు లెల్లరును సర్వ విధముల తోడ్పడవలసినదిగా కోరిరి.

తాలూకా యందితర ఫాసిస్టు వ్యతిరేక ప్రచారమును గావించుటకు శ్రీయుత కోనా నాగన్నగారిని కార్యదర్శిగను, శ్రీయుతులు బి. అంకిరెడ్డి, బి. లింగారెడ్డి బి. ఏ., గొప్ప అధ్యక్షులుగను, ఒక వుప సంఘమును నియమించిరి.

★ ★

రష్యా విజయోత్సవాలు

జూన్ 22 వ తేదీ రష్యా విజయోత్సవాలు ఈక్రింది ప్రదేశాలలో జరిగినట్లు మాకు రిపోర్టులువచ్చాయి.

కృష్ణాజిల్లాలో బెజవాడ, తెలప్రోలు కాటూరు, కోడూరు. (బెజవాడ తాలూకా) గుడివాడ, వానపాముల, భట్ల పెనుమర్రు అవనిగడ్డ, గ్రామాలలోను, గుంటూరుజిల్లాలో, క్రాప, రేపల్లె, బేతపూడి, గ్రామాలలోను; పశ్చిమగోదావరిజిల్లాలో, ఏలూరు, పోతునూరు, పెదపాడు, తణుకు, గణపవరం గ్రామాలలోను; తూర్పుగోదావరి జిల్లాలో కాకినాడలోను, జరిగాయి ఇవిగాక చిట్టగుంట, గిద్దలూరులలోకూడజరిగాయి.

రైతు - కూలీ సామరస్యం

పశ్చిమగోదావరిజిల్లాలో నరసాపురం తాలూకాలోని చించినాడ కూలీలకు రైతులకు మధ్య నాలుగైదు నెలలుగా తగాయిదాలు పెరుగుతూవచ్చి చివరకు తీవ్ర రూపందాల్చాయి. దెబ్బలాటకు సన్నిద్ధమయ్యి కొట్టుకునే స్థితికి వచ్చాయి. ఈ తగాయిదాకు కొన్ని ముఖ్య కారణములు ఇవి. వ్యవసాయ కూలీలైన హరిజనులు పేటలోగల మంచినీటి చెరువుకు వెళ్ళు మార్గమును రైతులు అభ్యంతర పరచి కూలీలకు ఇబ్బంది కల్గించారు. ఆవిషయంలో తగాయిదాలు పడ్డారు. ఆ గ్రామంలొ రైతులు కూలీలలో ఎవరైనా తప్పుచేస్తే వీధిలోనికి తీసుకువచ్చి తన్నడం, కొట్టడం సాగించుతున్నారు. కూలీలు సంఘం పెట్టుకుని కట్టడిగాఉండి తమను కొట్టడం, తిట్టడం పనికిరాదని అలాచేయడం అన్యాయమనీ ఇకముందు అలాచేయడానికి వీలులేదని గట్టిగా చెప్పారు, ఎవరైనా తప్పుచేస్తే కూలీ సంఘం మందలిస్తుందిగాన సంఘానికి తెలియచెయ్యాలన్నారు. దాని తర్వాత ఒక కూలీని కొబ్బరికాయల దొంగతనం చేశాడని రైతులు గ్రామంలోకి తీసుకు వెళ్ళి కొడుతూఉండంగా కూలీలంతా వెళ్ళి విడిపించుకొని తీసుకువాచ్చారు. దానితొ రైతులకు కూలీసంఘంఉండటం కంటకంగా తోచింది. కూలీలు సంఘం పెట్టుకుని తెలివిమీరి పోతున్నారని కూలీ సంఘమును అణచివెయ్యాలని రైతులు నిర్ణయించుకున్నారు. కూలీలను అణచాలని కల్పిత కేసులు పెట్టడం కూలీల పశువుల్ని తమ పొలాల్లోకి వచ్చాయని బందెలదొడ్డిలో పెట్టడం తమ భూముల గుండా మనుష్యులను పశువులను మసలనియ్యకపోవడం చేశారు. ఈనిర్బంధము వల్ల కూలీలు రైతులకు పనులు చెయ్యడం మానారు. రైతులు కూలీలకు కౌలుకిచ్చిన భూములను మరమ్మతు చేసుకున్న తరువాత వాటిని సాగు రోజులువచ్చే ముందు లాక్కున్నారు. కూలీల కష్టనష్టాలు ఎక్కువ అయినవి. వీరిచుట్టు రైతు పొలాలకే అవడంవల్ల కొన్ని తావుల్లో రైతుల పొలములోనే వారి ఇండ్లు ఉండడం పశువులుగాని మనుష్యులు గాని రైతుల పొలాల్లోకి అడుగు పెట్టకుండా ఉండడం అసాధ్యం అవుతుంది. వారిపొలముల్లో కూలీలు చిక్కితే రైతులు తమసొత్తు హరించడానికి వచ్చారనీ, హరించారనీ నేరములు మోపుతున్నారు. ఇటువంటిదుర్భరస్థితిలో ఉన్న కూలీలకు తప్పుడు సలహాలుకూడా కొందరు ఇచ్చారు. ఆలోచనా, దూరదృష్టిలేని అరాజక వాదులు దౌర్జన్యము కొట్లాట ద్వారానే కూలీల బాధలు తీరుతవని కూలీలను రెచ్చకొట్టారు. స్థానిక కమ్యూనిస్టుల సహాయంతో గ్రామకూలీ సంఘం దొంగతనములు, వగైరాలు జరగడానికి తమ సంఘానికు ఎంత మాత్రము సంబంధంలేదని అట్టి పనులు చేసేవారిని కూలీ సంఘం మర్దించదని, అట్టి తప్పు చర్యలను అరికట్టడానికి కృషి చేస్తుందని గ్రామాలలోని రైతులకు తెలియజేసారు.

రైతులు పెట్టే బాధలు, జరిగే అన్యాయాలను వివరించుతూ తమ కోర్కెలను తెల్పుతూ గ్రామంలోను పరిసర గ్రామాల్లోని రైతులతోను, కూలీలతోను కరపత్రముల ద్వారాను స్వయంగా వెళ్లి ప్రచారం చేశారు ఇదే విషయం ప్రభుత్వ అధికారులకు అర్జీలద్వారా తెలియచేశారు. తాలూకా కాంగ్రెసు సంఘమునకు కూడా పిటిషను పంపించారు. అన్యాయాలు అక్రమాలు, మానుకోవాలనా అలా అయితే తాము రాజీకి సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. గ్రామంలో కూలీలలో ఉండే విభేదములు చీలికలు లేకుండా ప్రయత్నించిఇదివరకుచీలిఉన్నవారికినచ్చచెప్పి తమలో చేర్చుకొని సంఘమును బలపర్చుకున్నారు. చుట్టుపట్ల గ్రామాలలో కూలీల కోర్కెలంటే సాను భూతి ప్రబలింది. గ్రామంలోని రైతులలో కొంతమందికి కూలీల కోర్కెలంటే వ్యతిరేకత తగ్గిపోయింది. వారు బహిరంగంగా కూలీల వైపుకు రాకపోయినా, వారిలో కొంత మంది రాజీకి అనుకూల భావాలు వెల్లడించారు, తాలూకా కాంగ్రెసు సంఘాధ్యక్షుడు యం. సత్యనారాయణ రాజు, బయ్యా సుర్యనారాయణమూర్తి, గొట్టుముక్కల వెంకన్నగార్ల సమక్షంలో గ్రామంలోని కూలీ రైతులు సమావేశం జరిగింది. రాజీకుదిరింది. కూలీల నుండి రైతులు లాక్కున్న భూములు తిరిగి ఇవ్వడానికి, కొట్టడం, బూతులు తిట్టడం మానడానికి రైతులు అంగీకరించారు కూలీలెవరూ రైతుల పొలముల దొంగతనములు చెయ్యకుండా కూలీసంఘం బాధ్యత వహించుతానని హామీఇచ్చింది. ఇంతటినుండి కూలీ రైతుల మధ్యవచ్చే తగాయిదాలను పరిష్కరించడానికి గాను కూలీలు రైతులు ఇతరులు (అన్ని కులముల వారు) గల 18 మంది సభ్యులతో పంచాయితీ సంఘం ఎన్నుకున్నారు. పరిస్థితులు చక్కబడి గ్రామంలో పనులు ప్రశాంతంగా జరిగిపోతూన్నాయి.

[చించినాడలో కూలీలకు రైతులకు మధ్య వచ్చిన తగాదాలను పరిష్కరించడానికి అచ్చటి కమ్యూనిస్టులు, కూలీసంఘం అనుసరించిన విధానం బాగుంది ఇదే సరియైన పద్ధతి, ఇతర జిల్లాలలో వ్యవసాయ కూలీలలో పనిచేసే కామ్రేడ్సు ఈ పద్ధతినే అనుసరించాలని సూచిస్తున్నాము—సంII]

డిటెన్యూల విడుదల

వెల్లూరుజైలునుంచి విడుదలై వచ్చిన 29 మంది ఆంధ్ర డిటెన్యూలకు 27-6-42 తేదీని బెజవాడ రైలుస్టేషనువద్ద వారికి ఘనమైన స్వాగతం ఇవ్వబడింది. వారిని పెద్ద వూరేగింపుతో శ్రీహనుమంతరాయ గ్రంథాలయంకు (గాంధినగరం) తీసుకొని వెళ్ళారు. అక్కడ కామ్రేడ్ కంభంపాటి సత్యనారాయణ ఎం. ఎ. గారు ఎర్రజెండాను ఎగురవేసి, టౌన్ ఫాసిస్టు వ్యతిరేక కేంద్రాన్ని ప్రారంభోత్సవం చేశారు. వీరికి స్వాగతమివ్వడానికి సాయంకాలం 5 గంటలకు గాంధీపార్కులో శ్రీమతి ఆచంట రుక్మిణిలక్ష్మిపతిగారిఅధ్యక్షతను పెద్ద బహిరంగసభ జరిగింది.

యుద్ధ పర్యాలోకనం

గతవారంలో కూడ సోవియటుయుద్ధ రంగంలో ప్రధాన రంగాలు ఖార్కొవ్, సెబాస్టపోల్ రంగాలే, జర్మనులు ఈ రెండు ప్రాంతాలలో విజయం సంపాదించి కాకేషియా నూనె గనులపైకి దూకడానికి సర్వ శక్తులూ వినియోగిస్తున్నారు. ఖార్కొవ్ రంగంలో టాంకు యుద్ధాలు తీవ్రంగా సాగుతున్నాయి. ఇంతవరకు ఎన్నడూ ఉపయోగించనన్ని టాంకులను జర్మనులు యిప్పు డుపయోగిస్తున్నారని ఇజ్వెస్టియా పత్రిక రాస్తూ వుంది. జర్మనుల ఒత్తిడి వలన సోవియట్ సేనలు, కుప్యాన్స్క్ అనే పట్టణాన్ని ఖాళీ చేశాయి. ఇది ఖార్కొవ్‌కు ఆగ్నేయంగా 65 మైళ్ళ దూరంలోవుంది. ఖార్కొవ్ రంగంలో సోవియటు సేనలు జర్మను సేనలపై యెదురు దాడులు సాగిస్తూ కొన్ని కీలక ప్రాంతాలను తిరిగి లాగుకుంటున్నట్లు అఖరి వార్తలు.

ప్రపంచదృష్టి అంతా సెబాస్టపోల్ పై వుంది. నాజీసేనలు 10 రోజుల క్రితమే సెబాస్టపోల్ రక్షణ శ్రేణులను ఒకచోట భేదించుకొని ముందుకు పోతున్నాయని వార్తవచ్చింది. సెబాస్టపోల్ రేపో మాపో పడిపోతుందని ప్రపంచం అనుకుంది. వేయి విమానాలు, 2 లక్షల జర్మను సైన్యం ముందు, సెబాస్టపోల్ ఇక ఎంతోకాలం ఆగదు అని ప్రపంచం అంతా అనుకుంది. కాని సోవియటు వీరసైనికులు ప్రపంచాన్ని ఆశ్చర్యచకితులను గావించి నేటికీ జర్మనులను నిలబెట్టి యుద్ధం చేస్తూనే వున్నారు. ఒక్కొక్క రోజు జర్మనీ విమానాలు వేయిసార్లు సెబాస్టపూల్ పై దాడులు చేసి బాంబులవర్షం కురిపిస్తూనే ఉన్నాయి జర్మనుసేనల అగ్నివర్షమంతా మందుగుండు వర్షమంతా, సెబాస్టపూల్ పై పడుతూనే ఉంది. సెబాస్టపూల్‌లో వీధులన్నీ, ఇండ్లన్నీ నేలమట్టమయ్యాయి. సెబాస్టపూల్ సంరక్షకులు తమ స్థానాలను వదలక పోరాడుతూనే వున్నారు. కడకు జర్మను సేనానులు కూడ "సెబాస్టపూల్ యుద్ధం ప్రపంచ మిలిటరీ చరిత్రలో ఏ యుద్ధంతోనూ పోల్చడానికి వీలులేదని, నిరుపమాన యుద్ధం" అన్నారు. సోవియటు నౌకాదళంనిరంతరం, సెబాస్టపూల్‌కు గావలసిన సరఫరాలు తెచ్చి అందిసే వుస్తూంది. సెబాస్టపూల్ నుండి స్త్రీలను పిల్లలను ఖాళీ చేసింది. సెబాస్టపూల్ నుండి జర్మను సైనికుల ఒత్తిడిని తగ్గించడానికి క్రిమియాలో కొన్నిచోట్ల సోవియటు సేనలు జర్మను సైనికుల వెనుక దిగాయని కూడ వార్తలు. కాని సెబాస్టపూల్ పై జర్మనులు తమ దాడులను మానలేదు. మరియొక 5 డివిజన్లు, అంటే లక్ష సైన్యాన్ని కూడ సెబాస్టపూల్ పైకి జర్మనులు పంపించారని ఆఖరివార్త.

ఈజిప్టు రంగం:

సోవియటు సేనలు కాకేషియా, ఇరానులపై నాజీ జర్మనులు వేసిన కత్తెర వ్యూహంలోని ఉత్తర బాహువును అరికట్టుతూ వున్నప్పుడు, దక్షిణాన లిబియాలో, ఈజిప్టు రంగాలలో నాజీ సేనలు మన సేనలకు ఒక గొప్ప ఓటమి కల్గించాయి; టోబ్రూక్ పతనంలో దాదాపు 30 వేల మందిని ఖైదీలుగా పట్టుకున్నామని శత్రువులు ప్రకటిస్తున్నారు. ఈ నష్టంతో బలహీనమైన మన సైన్యం, ఈజిప్టులో మెర్సామాట్రూ వద్దనున్న రక్షణ శ్రేణులకు వెళ్ళిపోవలసి వచ్చింది. నాజీ సేనలు వెనువెంటనే వచ్చి నేడు మెర్సామాట్రూ వద్ద మన సేనలతో తలపడ్డాయి. ఇక్కడనుండి కూడా మన సైన్యాలు వెనక్కి వెళ్ళవలసి వచ్చింది. ఈజిప్టు, సూయజులను ఏ విధంగానైనా శత్రువుల చేతిలో పడకుండా కాపాడాలి. లేనిచో ఇరాన్‌పైకి శత్రువుల మార్గము సులభం కావడమే గాక మెడిటరేనియన్‌లోని మన నౌకా దళం కూడ మధ్యధరా సముద్రాన్ని వదలి హిందూ మహాసముద్రంలోకి వచ్చివేయవలసి వస్తుంది. అక్షరాజ్యాల బలం చాల హెచ్చుతుంది.

ఈ క్లిష్ట పరిస్థితులలో ఈజిప్టుపై అక్షరాజ్యాలు ముందుకు తోసుకువస్తూ వున్నపుడు, ఈజిప్టు ప్రధాని, ప్రజానాయకుడు అయిన నహాస్ పాషా, ఈ అక్షరాజ్యాలపై యుద్ధం ప్రకటించననీ, కడకు మిత్రమండలి యుద్ధ ప్రయత్నాలను ఈజిప్టు మనుష్యులను, కార్మికులగా కూడ ఉపయోగించ నివ్వనని, తా నిదివరకు చేసిన ప్రకటననే తిరిగి చేశాడు.

జర్మనీ నష్టాలు	—	సోవియట్ నష్టాలు
మొత్తం 1 కోటి.	{ చనిపోయినవారు, గాయపడినవారు, ఖైదీలు }	మొత్తం 45 లక్షలు.
35 లక్షలు	ఇందులో చనిపోయినవారు ;	
30,500	ఫిరంగులు,	22,000
24,000	టాంకులు,	15,000
20,000	విమానాలు	9,000

ఇదివరకు బ్రిటిషు సామ్రాజ్య పాలకులు గావించిన అన్యాయాలను మనస్సులో పెట్టుకొని, నేడు ఈజిప్టు స్వాతంత్ర్యాన్ని అక్షరాజ్యాల బారినుండి రక్షించుకోదానికి నిరాకరించడంలో ఈజిప్టు ప్రజలకు తీరని నష్టం కలుగజేస్తున్నాడు. ప్రపంచ ప్రజలందరికీ పెద్ద నష్టాన్ని కలుగజేస్తున్నాడు. తన మాతృభూమిపై జరిగే యుద్ధం తనది గాదని ప్రేక్షకుని లాగ చూస్తూ ఉండడం ఎలాంటి దేశభక్తియో మాకు అర్థం కావడంలేదు.

యూరప్ రంగము:

చర్చిల్ రూజ్వెల్టుల సంభాషణల పిదప వెలువడిన ప్రకటనలో, త్వరలో సోవియట్ పైన జర్మనుల ఉధృతాన్ని తగ్గించడానికి కావలసిన చర్యలు తీసుకోబడుతాయి" అని ఉంది. ఆచర్యలకు ప్రపంచ ప్రజలంతా వేగిరపాటుతో ఎదురుచూస్తారు. ఈలోపల యూరప్ ప్రజలు తమ కర్తవ్యాన్ని సాగిస్తూనే ఉన్నారు, యుగోస్లోవియాలో ప్రజాసైన్యం, మాంటినీగ్రో ప్రాంతంలో ఇటాలియన్లు చేతిలో ఉన్న మిగిలిన రెండు పట్టణాలను చుట్టుముట్టడించింది.

తిరిగి ఈవారం వేయి బ్రిటిష్ విమానాలు (బాంబర్లు) జర్మనీపై దాడి జరిపాయి. బ్రెమెన్ అనే రేవుపట్టణంపై ఈదాడి జరిగింది. బ్రెమెన్, సబ్ మెరీన్లను ఎక్కువగా నిర్మించేస్థలం. వేయి బాంబర్ల దాడులుకూడ రష్యన్ రంగంలోని జర్మను ఉధృతాన్ని తగ్గించలేవు. రెండవ రంగాన్నారంభించడమే దీనికి మార్గం. టోబ్రుక్ పడిపోయిన పిదప, ఈజిప్టుకు నేడు క్రొత్తగా సేనలు పంపడానికి ప్రయత్నించడం చాల ఆలస్యానికి కారణమవుతుంది. యూరప్‌లో రెండవ రంగాన్ని ఆరంభించి జర్మనీని ఉక్కిరిబిక్కిరి చేస్తే, సోవియటు సేనలు,ఇరాన్ సిరియా ఈజిప్టులలో శతృవు నెదుర్కొనడానికి పోగల్గుతాయి. జర్మనీ, రోమెల్ సేనానికి, సైనికులనుగాని సరఫరాలను గాని పంపలేదు. యూరపులో రెండవ రంగమే, ఈజిప్టులోనికి బ్రిటిషు విజయానికి కూడ తోడ్పడు తుందని న్యూస్ క్రానికల్ వ్రాస్తూఉంది. చీనా- జపాను యుద్ధరంగం చీనా తీరాన్ని,చెకియాంగు-చంగ్షా-చంగ్షా, కాంటన్ రైలు మార్గాలనుఆక్రమించుకోదానికి చేసేయుద్ధంలో, గత వారం, జపాను సైనికులు, ఏమాత్రం ముందుకు పోలేక పోయారు. చీనా సేనలే చాల చోట్ల జపాను సైనికులను వెనక్కి నెట్ట గలిగాయి.

సోవియటు- జర్మనీ యుద్ధసాంవత్సరిక దినంనాడు సోవియటు సేనలకు చీనా యుద్ధ మంత్రితో 'హో'యంగ్ సందేశం పంపాడు. "జపాను మీపై బడకుండా మేము జపానుతో యుద్ధం చేస్తున్నాం. జపానును బలహీనపరుస్తున్నాం. ఒకవేళ జపాను మీపై దుమికితె, తప్పక మీతో పూర్తిగ కలిసి పోట్లాడుతాం." సోవియటుపై బద్ధద్వేషంగల సేనానిమంచూరియాలో గవర్నర్ జనరల్‌గా నియమంపబడటం, ఒక సోవియటు వర్తకనౌకను జపాను సబ్మెరైనును ముంచడమూ, సోవియటుపై త్వరలో జపానుదాడిచేయడానికి నిదర్శనాలని చీనా పత్రికలువ్రాస్తున్నాయి. చీనా కోరినట్లు త్వరలో విమానాలను సరఫరాచేయడానికి కూడ చర్చిల్ రూజ్వెల్టులు అంగీకరించారు. అమెరికా నెలకు 4000 విమానాలు 1500 టాంకులు లక్ష మరతుపాకులు తయారు చేస్తుంది.

ఆసియాప్రజలకు 2 అభయాలు

చీనా విదేశాంగ మంత్రి టి. ఎ. సూంగ్ అమెరికాలో ఉపన్యసిస్తూ "ఆసియా ఖండం యితర దేశాలకు మార్కెట్టుగా వుండడానికి, ముడి సరకులను యితర దేశాలకు మార్కెట్టుగా వుండడానికి, ముడి సరకులను యితరుల లాభాలకోసం చాకిరి చేసే కార్మికులను సరఫరా చేయడానికి విసిగిపోయింది. చీనా యుద్ధ ఆశయాలు. ఆసియా ఖండం యొక్క రాజకీయ ఆర్థిక స్వాతంత్ర్యం, ప్రపంచమందు శాంతి నెలకొల్పడానికి ఒక అంతర్జాతీయ నిర్మాణం" అని ప్రకటించాడు.

ఆంగ్లో- సోవియటు ఒడంబడికపై డాక్టరు పట్టాభి ఒక విసురు విసిరాడు. సోవియటు యూనియను ఇండియాకు అట్లాంటిక్ చార్టరు వర్తించదన్న చర్చిల్ ప్రకటనను అంగీకరించిం దన్నాడు. ఇది అసత్యం. మాల్టోవ్ ఉపన్యాసం ఆంగ్లో- సోవియటు ఒడంబడిక ఆశయాలను స్పష్టంగా వెల్లడిస్తూంది.

"ఈ ఒడంబడిక స్టాలిన్ ప్రకటనలోని ఆశయాన్ని బలపరుస్తుంది. స్టాలిన్ ప్రకటన ఇది' యూరపులో గాని ఆసియాఖండంలో గాని (ఇరాన్‌లో సైతం) ఇతర దేశాలను ఆక్రమించుకోడం, ఇతరదేశ ప్రజలను, వారి దేశాలను బానిసలనుగా చేయడం మా యుద్ధ ఆశయాలు కావు. అట్టి ఆశయాలు మేము కల్గివుండలేము' తమ విధానంలో ఈ స్నేహపూర్వక సిద్ధాంతాలను స్వాతంత్ర్య ప్రియు లైన జాతుల కన్నింటికి సోవియటు యూనియను బ్రిటను ప్రకటిస్తున్నాయి. ఇతర జాతుల దేశాన్ని ఆక్రమించుకొని వారిని బానిసలుగా చేయడానికి యుద్ధం చేస్తున్న హిట్లరు జర్మనీ దురాక్రమణ విధానానికి తమ విధానానికీగల మూల విభేదాన్ని, బ్రిటను సోవియటు ఈ ఒడంబడిక ద్వారా తెలియజేస్తున్నాయి. శాంతి పరిష్కారంలోను, యుద్ధానంతర కాలంలోనూ, బ్రిటను సోవియటులు ఇతర యునైటెడ్ నేషన్సుతో కలసి పని చేయడానికి ఈ ఒడంబడిక ఏర్పాటు చేస్తుంది, అందరికీ తెలిసిన అట్లాంటిక్ చార్టరులోని మూల సూత్రాల ననుసరించే ఈ కలసి పని చేయడం వుంటుంది."

యునైటెడ్ నేషన్సులో ఇండియా, చైనాలు ప్రత్యేకంగా వున్నాయి. యునైటెడ్ నేషన్సు పట్టికలో బ్రిటిషు సామ్రాజ్యపు పేరు ఎక్కడా లేదు. అందుచే సోవియటు బ్రిటిషుసామ్రాజ్యాన్ని అంగీకరించి దానితో కలిసి పనిచేస్తానని చెప్పలేదు. అట్లాంటిక్ చార్టర్‌లోని మూల సూత్రాల ననుసరించే ఇండియాతో కలసి పనిచేయడానికి పూనుకుంటామని సోవియటు ఈ ఒడంబడికద్వారా ప్రకటించింది. బ్రిటిషు ప్రభుత్వంచే కూడ అట్టి ఒడంబడికపై సంతకం చేయించింది.

(1 వ పేజీ తరువాయి)

యితరులకు సాహాయము చేసే వారముగాము, అని గాంధీజీ అంటున్నాడు. బ్రిటిషు సైనికుల చలనానికి తనవుద్యమం అడ్డురాదన్న గాంధీ ప్రకటన చాలదు. అతని పూర్తి కార్యక్రమం తెలిసినప్పుడే ఆ ప్రకటన యెంతవరకు ఆచరణలో అవలంబింపబడేది ప్రపంచానికి తెలుస్తుంది. నేడు యుద్ధ ప్రయత్నాలను పెంపొందింపజేయుట, బ్రిటిషు ప్రభుత్వానికి సాయం చేయుట గాదు. బ్రిటిషు ప్రభుత్వ సంకోచాన్ని త్రోసివేస్తూ, మన ప్రజలకు సాయంచేయడానికి మన ప్రజలను జపాను దాడినుండి రక్షించుకోడానికి మన ప్రజలను బ్రిటిషు అధికారాన్నుండి విముక్తులను చేసుకోడానికి మార్గం ప్రస్తుత యుద్ధ ప్రయత్నాలను కూడ ప్రజల కనుకూలంగా ఉండేటట్లు ఎన్నోరెట్లు పెంపొందించడమే. తటస్థంగా కూర్చోవడం ప్రజలలోపిరికితనం నిరాశ, నిస్పృహలను పెంచిజాతీయ పారతంత్ర్యానికి దారితీయడమే.

END OF ISSUE